# దేవదాసి

## ౧

నాటిరాత్రి కార్తికేయ దేవాలయంలో దేవదాసి వకుళమాలిక నృత్యోత్సవం! ఆ ఉత్సవం ప్రారంభమై అయిదారురోజులే అయింది. ఐనా పౌండ్రవర్ధన నగర పౌరుల హృదయాలలో ఆ వార్త కార్చిచ్చులా వ్యాపించి వారి లోలోపల యౌవనోన్మాదాలు రేకెత్తించింది!

వకుళమాలిక ఆవేళ అపరాహ్ణం అంతా అలంకరణతోనే గడిపివేసింది. చెలికత్తె కమల ఆమె కెన్నెన్నోమారు లలంకరించింది. జడగంటలు, ముత్యాలహారాలు, ఇతరాలంకారాలు సరికొత్త తీరులతో సరిదిద్దింది. అయినా వకుళమాలిక కవేమీ నచ్చలేదు!

కమల మళ్ళీ మొదటినుంచీ అలంకరణ ప్రారంభించింది. అయినా వకుళమాలిక ఏవేవో వంకలు పెడుతూనే ఉంది. కమలకిక ప్రాణం విసిగిపోయింది.

ఒక కుంచికతో ఆమె పాదాలకు మందారవర్ణం లత్తుక పూసింది. ఆ పాదాలకు పైపైన చిన్నచిన్న జాజిపూల చిత్తరువులు చిత్రించింది. వకుళమాలిక కాపూలరేకుల తీరు లంతగా నచ్చలేదు! కమలకేమీ పాలుపోలేదు.

కుంచిక లాక్షారసపాత్రికలో ఉంచి ఒక చిరునవ్వు చిలకరించి మెల్లగా అడిగింది: "ఏమిటే! వకుళా! ఈ సన్నాహం అంతా! ఏమిటి కథ!"

వకుళమాలిక దానికి తిన్నగా సమాధానం చెప్పలేదు!

"త్వరగా కానీ! అప్పుడే సూర్యాస్తమానం కూడా అయిపోయింది! ఈ వేళ కూడ వేళ మించిపోతూంది!"

"కమల ఆమెకేసి అలాగే కొంటెగా చూసింది. అంతేగాని అలంకరణ సాగలేదు. అది అక్కడే నిలిచిపోయింది. కమల ఆమెకేసి బాగా పరిశీలనగా చూసి—

"నాకుకూడా తెలియనీయకుండా దాచి పెడుతున్నావా! సరేలే!" అంది.

వకుళమాలిక కిక వేరేదారి కనబడలేదు!

"నేనొక మాట అడుగుతాను గాని— వేళాకోళం చెయ్యకూడదా!"

"నిజం చెబితే నీకు వేళాకోళంలాగే కనబడుతుందిలే!"

"సరే! కాని, నీకెప్పుడయినా ఎవరిమీదయినా అనురాగం కలిగిందా?"

"అనురాగమా? అంటే!"

కమల పకపకా నవ్వింది.

"చాల్చాలులే కొంటెవేషాలు!"

"నిజమే! నేనింతవరకెప్పుడు ఈ మాట వినలేదు. అయినాగాని మన కనురాగాలు ఏమిటే! నీకేమైనా మతిగాని పోయిందా?"

వకుళమాలిక ఒక నిట్టూర్పు విడిచింది. తరవాత ఆమె అరచేతిపై చెక్కిలి ఆన్చి ఎదురుగా గాలిలో మెల్లిగా కదలాడే పంచరంగుల చిలక బంగారుపంజరంకేసి పరధ్యానంగా చూసింది.

వకుళమాలిక కొంత తెలివితెచ్చుకొని పైపైకొక చిరునవ్వు నవ్వింది.

"నా మతికేంగాని, ఆ సంగతి తేల్చావా?"

"ఏ సంగతి!"

"ఆ రాజకుమారుని సంగతి!"

"అతడేమి అంతటి రాజకుమారుడు కాడులే! కాశ్మీర చక్రవర్తి జయాపీడదేవుని పదాతిసైన్యంలో సామాన్య యోధుడుగా ఉండేవాడట! ఇక ఇప్పుడదీ లేదు!"

"మరి పేరో!"

"విజయవర్మ"

"విజయవర్మా! చక్కని పేరే! అయితే క్షత్రియ కుమారుడేనన్న మాట!"

"కాని రాజకుమారుడు మాత్రం కాదు!"

"ఇవన్నీ నీకెలా తెలిశాయో!"

"కర్ణాకర్ణిగానే విన్నాను."

"ఇంతా చేసి నీ వాయనతో మాట్లాడనే లేదా?"

"లేదు!"

"ఏదో వ్రతంపట్టి పుణ్యతీర్థాలు సేవిస్తున్నాడట! ఆ వ్రతం ఉద్యాపన కావాలట!"

## ప్రాచీన గాథాలహరి

కమల మళ్ళీ ఆమె పాదాలపై లాక్షాచిత్రణ మొదలు పెట్టింది.

వకుళమాలిక కొంత సేపటిదాకా ఆమె చిత్తరువుల సొగసు పరిశీలించింది. అంతేగాని ఏమీ మాట్లాడలేదు.

అది కార్తిక మాసం. సాయంకాలం మంచు ముసుగులో నగరంలో కార్తీకదీప తోరణాల వెలుగులు కొంచెం కొంచెం కనబడుతున్నాయి. దేరాయి. సమీప దేవాలయాల్లో నృత్యోత్సవ కోలాహలాలు వినవస్తున్నాయి. కమల అలాగే ఎంతో శ్రద్ధగా ఆమె పాదాలపై లత్తుక చిత్తరువులు చిత్రించింది. అంతలో ఆమె శిరస్సుపై ఒక వేడి కన్నీటిచుక్క పడింది.

కమల తల పైకెత్తి చూచింది. వకుళమాలిక చెక్కిలిపై ఇంకొక కన్నీటి చుక్క దిగజారింది.

"నీకు నిజంగా మతిపోయింది! సందేహం లేదు!" అన్నది కమల అలాగే కొంటెగా చూస్తూ.

"వకుళమాలిక కొక్కసారిగా చిరాకు తలకెక్కింది.

"మగరాయుడికి వ్రతాలు, ఉద్యాపనలు ఏమిటే!"

"అదేమి విడ్డూరమోనమ్మా! నాకేం తెలుసు!"

"ఇందులో నీ కల్పన కొంత!"

"చివరికిదంతా నా మీదే విరుచుకుపడుతుందని నాకు ముందే తెలుసునులే!"

అని కమల మూతి బిగించింది తరవాత లత్తుక చిత్తరువులు కూడా ముగించింది. పిమ్మట ముంగురులలో ముత్యాల అలంకరణ ఉపక్రమించింది.

"వకుళమాలిక మళ్ళీ అడిగింది. "మరి నేటి రాత్రి నృత్యోత్సవాని కాయన వచ్చేనా?"

"ఆ మగరాయుడి కంతకన్నా వేరే రాచకార్యమేమీ ఉన్నట్టు కనబడదే!"

"అయితే—అంత బెట్టెందుకో!"

"నిజమే మరి! దేనికయినా పట్టు విడుపు ఉండాలి!"

కమల అలంకరణ అంతా చాలవరకు ముగిసిపోయింది. ఇంతలో ఒక పరిచారిక బంగారు పళ్ళెంలో సరికొత్త నగలు, రత్నహారాలు, చీనీచీనాంబరాలు తీసుకువచ్చి, వకుళమాలిక పాదాలకు దగ్గరగా

**పి. గణపతిశాస్త్రి**

తల్పకంబళంమీద ఉంచింది. ఆమె అదిమాచి నిర్ఘాంతపోయింది.

"ఎవరే ఇవి పంపినవారు!"

"అమ్మగారు!"

"అవును లే! పైవారి మాట అనుకుంటున్నాను!"

"శ్రేష్ఠి చందనగుప్తుడు!"

"ఇక ఇలాంటివి తీసుకురావద్దని నీతో చెప్పలేదా?"

పరిచారిక హడలిపోయింది.

"అవునమ్మా! చెప్పాను! కాని అమ్మగారు మీతో మరీమరీ చెప్పమని పంపించారు!"

కమల ఆ కానుకలకేసి చూసింది. ఆమె కళ్లు చెదిరిపోయాయి. మెల్లిగా దేవదాసి అలంకరణ ముగించివేస్తూ ఇలాగంది:

"చందనగుప్తుడు సార్థవాహ వ్యాపారంలో కోటికి పడగెత్తిన కుబేరుడు! తెలిసిందా!"

"అయితే?"

"వకుళా! నామాట వినవు గాని—ఉన్నమాట అనేస్తున్నాను! సరిగా మోకాలొడ్డుతున్నావే నువ్వు!"

వకుళమాలిక దురుసుగా సమాధానము చెప్పింది:

"సరే! నీ పని కానీ! చిరసింగారం అయేసరికి ఊరు మాటుమణిగి పోతుంది!"

కమల మరి మాటాడడానికి సాహసించలేదు!

ఇంతలో ఇంకొక పరిచారిక వచ్చి బెదిరిపోతూ ఇలాగ విన్నవించింది:

"అమ్మగారు ఎలాగయినా ఒక్కసారి లోపలికి రమ్మంటున్నారు."

"నే నిప్పుడు కాలైనా కదపడానికి వీలులేదు! ఉత్సవానికి వేళ మించిపోయిందని చెప్పు! పో!"

ఆ పరిచారిక కాలి బొటనవ్రేలితో నేల మీద రాస్తూ అలాగే నిలుచుండిపోయింది!

"ఏం కదలవేం! మాట విన్నపడడం లేదా!"

ఆ పరిచారిక లోపలికి వెళ్లిపోయింది.

కమల అలంకారం ముగించి ఒక సువర్ణ దర్పణం చేతపట్టుకుని ఆమెముందు నిలబడింది.

ఇంతలో ఇంతకు పూర్వం వెళ్ళిన పరిచారిక మళ్ళీ తిరిగివచ్చి, బెదురుతూ బెదురుతూ దేవదాసి కెదురుగా నిలబడింది.

వకుళమాలిక మండిపడింది.

ఏం! మళ్ళీ ఎందుకు వచ్చావే!"

"శ్రేష్ఠి చందనగుప్తులు మీకోసం వేచి ఉన్నారట! అమ్మగారు కొత్తనగలలంకరించుకొని ఎలాగయినా ఒక్కసారి లోపలికి రమ్మన్నారు!"

వకుళమాలిక పాదాల దగ్గర ఆ బంగారు పళ్ళెం ఆ సరికొత్త నగలతో తళతళా మెరిసింది. ఆమె ఒకసారి వాటికేసి చూసింది. వకుళ లోలోపలి కోపం రెచ్చిపోయింది.

"ఇప్పుడు వీలుపడదని చెప్పు! నాకవ్వేవీ అక్కరలేదు! పో! తీసుకుపో!"

పరిచారిక తటపటాయించి—

"అమ్మగారు నొక్కి నొక్కి చెప్పమన్నారు" అంది.

అంతే! వకుళమాలిక ఆ పళ్లెం అంచుమీద కాలికొద్దీ ఒక్క తాపు తన్నింది! అది ఎదురుగా ఉన్న గోడకు తగిలి టంగని మారుమోగింది! నగలు నాలుగుమూలలా చెదిరిపోయాయి.

"పో! తీసుకుపో! ఆ పళ్లెం! మరి నా ఎదట నిలబడకు!" అని అరిచింది దేవదాసి! ఆ పరిచారిక చిందర వందరగా చెదిరిన ముత్యాలహారాలు పళ్లెంలో పదిలపరిచి అది చేత బుచ్చుకుని తొందర తొందరగా అక్కడినించి వెళ్లిపోయింది.

కమల లోలోపలి నవ్వంతా గుంభనగా ఒక చిరునవ్వులో స్తంభింపజేసి కొంటెగా ఇలా గన్నది:

"ఇందాకటికంటె ఈ కోపంలో నే ఎంతో సొగసుగా కనిపిస్తున్నావే! నా మాట నమ్మకం లేకపోతే ఈ అద్దంలో ఒకమారు చూసుకో!"

వకుళమాలిక కమల చెంపమీద మెల్లిగా ఒకటి వడ్డించబోయింది. అంతలోనే అద్దానికి దగ్గరగా నిలబడి చెదిరిన ముంగురులు ముత్యాలహారాలు సరిదిద్దుకుని—

"కమలా! నిజంగా నే నీవేళ అంత సొగసుగా ఉన్నానా?" అంది ఎంతో జాలిగా.

"ఉత్తది! ఊరికే వేళాకోళాని కన్నాను గాని—ఒక్క చిన్న ముద్దు పెట్టుకోనా!"

వకుళమాలిక ఒక నిట్టూర్పు విడిచింది.

"ఈ కొంటెమాటలకేంగాని ఎలాగైనా ఆ విజయవర్మ నొక్కమారిక్కడికి తోడుకు రాగలవా?"

వకుళమాలిక మళ్ళీ నిట్టూర్చింది!

"అదిమాత్రం నావల్లగాదు! అంత ఛాందస పురుషుణ్ణి నే నెక్కడా కనీ వినీ ఎరగను!"

"ఇంతేనా? మరి నీ చాతుర్యం!"

కమల ఒక నిమిషం కొంచెం లోతుగా ఆలోచించింది.


"దేవుడు మేలుచేసి—ఒక వేళ తీసుకు రాగలిగితేనో?"

"ఇదిగో! ముత్యాలహారం!" అని ఆమె తన మెడలో ముత్యాలహారం తీసి కమల మెడలో వేయబోయింది!

"ఏదీ! ఆ మహానుభావుడు విజయవర్మ ఇక్కడికి వేంచేయనీ! అప్పుడు వేద్దువు గాని లే!"

"అప్పుడింకొకటి!" అని వకుళమాలిక ఆ హారం కమల మెడలో వేసింది!

కమల ముక్కుమీద వేలు వేసుకుని అదే పనిగా నవ్వడం మొదలు పెట్టింది. ఇంతలో ఒక పరిచారిక దీపం వెలిగించి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. కమల ఇంకా అలాగే నవ్వుతూంది! ఆ దీపకాంతిలో వకుళమాలిక



# దేవదాసి

అలంకారాలన్నీ తళతళా మెరిశాయి. ఆమె కమలకేసి ఒక నిమిషం విస్తుపోయి చూసింది.

"ఎందుకే ఆ నవ్వు?"

"ఇంత అందకత్తెవు గదా! ఎందుకే నీకింతటి బేలతనం!"

"నీవే అన్నావుగదా! అది మాత్రం నావల్ల గాదని!"

"అంతమాత్రానికే ఇంత తొందరా!"

ఇంతలో దూరదూరంగా కార్తికేయ దేవాలయస్వామి సంధ్యానృత్య సేవా సూచకంగా పెద్ద శంఖధ్వని మారుమోగింది.

వకుళమాలిక "అదిగో శంఖధ్వని విన్నావా! పద! పద! పోదాం!" అని తొందర చేసింది.

కమల తొందర తొందరగా వీధి గుమ్మంలో దేవదాసి కర్ణీరథం సిద్ధం చేయించి తిరిగి వచ్చింది. వకుళమాలిక తొందరగా నడిచి వెళ్ళి కమలతో బాటూ కర్ణీరథంలో కూర్చున్నది అది శరవేగంతో కార్తికేయ దేవాలయం వైపు వెళ్ళిపోయింది!

## ౨

కార్తికేయ దేవాలయంలో ఆ రాత్రి దేవదాసి చేసిననృత్యం చూచి సభాస్తారులు సమ్మోహితులై శిలాప్రతిమలైనారు. ఆనాడామె శివతాండవము, దారుకావనవిహారం మొదలయిన శివలీలలెన్నో అభినయించింది. పిమ్మట పార్వతీ పరిణయఘట్టం అభినయించడం ప్రారంభించింది. అది అంతకుపూర్వం చేసిన నృత్యాలన్నిటికన్నా బాగా రక్తికట్టింది. అందులోను అనంగదహనానికి పూర్వం పార్వతీదేవి ముగ్ధానురాగాభినయంలో ఆమె చూపిన హావభావప్రకటన చూచి, సభ్యులటువంటినృత్యం 'నభూతో నభవిష్యతి' అనుకున్నారు. వారంతా 'ఓహో' అని మెచ్చుకోడానికైనా వీలులేనంత తన్మయతలో పడిపోయారు!

దేవాలయ నృత్యమండపం జాజ్వల్యమానంగా వెలిగిపోతున్న దీపకాంతులతో కన్నులపండువుగా కలకలలాడింది. నృత్యమండపం స్తంభాలమీద శిల్పులు చెక్కిన అచ్చరల ప్రతిమ లాస్యనృత్యం చూచి విస్తుపోతున్నట్లున్నాయి. నాట్యమండపం గోడల మీద చిత్రించిన చిత్తరువులు కాంతులలో అప్పుడే చిత్రించినట్లు మెరిసిపోతున్నాయి.

వీణా వేణు మృదంగాల మేళవింపులో వకుళమాలిక చరణమంజీరాల సవ్వడులన్నీ ఏకమై ఒకేతీరుగా మారుమోగుతున్నాయి. ఆ నృత్యావేశంలో ఆమె హృదయంమీది ముత్యాలహారాలు, మొలనూలి మువ్వలు, కాలిగజ్జెలు, ముప్పేట జడగంటలు ఒకేలయలో ధ్వనిస్తూ దీపాల కాంతులలో తళతళ మెరిసిపోతున్నాయి. దేవదాసి కుమారస్వామి కభిముఖంగా నిలబడి నృత్యం చేస్తూ నృత్యంఅంతా ఆ దేవదేవునికొక కర్పూర హారతిలా సమర్పిస్తున్నది. ఆ వేయి స్తంభాల నాట్యమండపంలో గుమిగూడిన వేలాది సదస్యుల నేత్రాలన్నీ ఆ నృత్యానికనుగుణంగా ఆయా మనోభావాలభివ్యక్తం చేస్తున్నాయి. ఆ సభలో ఎక్కడా ఒక్క నిశ్వాసం విడిచిన సవ్వడి కూడా వినబడటంలేదు! సదస్యుల నేత్రాలన్నీ వకుళమాలిక నృత్యానికంకితమైపోయాయి.

కాని కమలకదేమీ పట్టినట్టు లేదు! ఆమె కనురెప్ప వాల్చకుండా అలాగే విజయవర్మకేసి చూస్తున్నది. అతడు నృత్యవేదికకల్లంత దూరంలో ఎవ్వరూ లేని చోట ఒక స్తంభాని కానుకొని కూర్చుని, ఎంతో ఆసక్తిగా ఆనృత్యం చూచి ఆనందిస్తున్నాడు. కమల బాగా పరిశీలనగా అతన్ని పరకాయించి చూచింది.

దేవదాసి నృత్యలయ కనుగుణంగా అతని వేళ్ళు స్తంభంమీద తాళంవేస్తున్నాయి! శరీరం అంతటా యోధవేషం. విశాలమైన నేత్రాలు, బలిష్ఠమైన శరీరం, పసి నిమ్మపండువంటి దేహచ్ఛాయ, కొంచెం కొనదేలిన సమున్నత నాసిక. చెవులచివర చిన్న చిన్న పైడి కుండలాలు. నూనూగు మీసాల నూత్న యౌవనం!

"వకుళమాలిక చేసిన ఎన్నిక మంచిదే! కాని కోటికి పడగెత్తిన చందన గుప్తునికీ ఈయనకు హస్తిమశకాంతరం!" అని ఏమేమో ఆలోచించించింది కమల. అంతలో ఆమె కళ్ళకెదురుగా వకుళమాలిక వాగ్దానం చేసిన ముత్యాలహారం ముప్పేటలతోను మెరిసినట్లయింది! ఆమె అది ఎలాగైనా సాధించితీరాలని నిశ్చయించింది. ఎలాగైనా ఏదో ఒక మిష కల్పించుకొని విజయవర్మతో ప్రసంగించాలని ఆమె సంకల్పించింది కాని ఇంతవరకు ఆ అవకాశం దొరకలేదు!

విజయవర్మ చేతివేళ్ళతో స్తంభంమీద తాళంవేస్తూ పరధ్యానంగా కుడిచేయి చాచాడు. తన భవంతిలో ఆవిధంగా చేయి చాపినప్పుడు తాంబూల కరండక వాహిని అతని చేతికొక కర్పూర తాంబూలం అందీయడం అతనికొక పరిపాటిగా ఉండేదేమో! ఈ విదేశ ప్రవాసంలో ఆ పరిపాటి మూలానే అతడావిధంగా చేయిచాచి ఉండవచ్చును! నేననుకున్నట్టు సామాన్య యోధుడుగా కనిపించడంలేదు! ఎవరో ఐశ్వర్యవంతుడేమో! అనుకొన్నది కమల. ఇంతలో విజయవర్మ తిరిగి ఇంకొకమారు అలాగే పరధ్యానంగా చేయిచాపడం జరిగింది. తాంబూలం అందిచ్చేవారెవరు లేకపోవడంవల్ల చాపిన చేయి అలాగే కిందికి దిగజారిపోయింది. కమల అది చూచింది. ఈమారు ఇలాంటి సదవకాశం జారవిడవ కూడదని నిశ్చయించింది. ఒక కర్పూర తాంబూల కరండకం చేత ధరించి నెమ్మదిగా అక్కడికి వెళ్ళింది, విజయవర్మ కూర్చున్న వేదిక పక్కనున్న స్తంభానికానుకుని నిలబడి, ఆ అవకాశంకోసం నిరీక్షించింది. తటాలున వకుళమాలిక నృత్యంలో ఒక ముక్తాయింపు ముగిసి తాత్కాలికంగా నృత్యం ఆగింది! విజయవర్మ తాంబూలంకోసం తిరిగి పరధ్యానంగా చేయి చాచాడు. అదే క్షణంలో కమల అతని చేతికొక కర్పూర తాంబూలపు చిలక అందిచ్చింది. అతడలాగే పరధ్యానంగా అది తీసుకుని పుక్కిట పెట్టుకొన్నాడు. వెంటనే కర్పూర పరిమళం ఘుమఘుమలాడింది! విజయవర్మ ఆశ్చర్యపడి పక్కకు తిరిగి చూచాడు. ఎవరో అపరిచిత వనిత! విజయవర్మకు మరింత ఆశ్చర్యం వేసింది. అలాగే


రవి టాయిలెట్స్ - అందముకు, వర్చస్సుకు




రవి గ్లిసరిన్ సోప్:-
అన్ని కాలములలో, ముఖ్యముగా వేసవి కాలములలో వాడదగినది. శరీరమును మృదువుగను, కాంతిగను ఉంచును.

రవి వెజిటబుల్ హేరాయిల్:
శిరోజములను విస్తారముగా పెంపొందించును. దాని చక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.

రవి స్నో:- ముఖవర్చస్సును కాపాడి, విలాసమును పెంపొందించును.

సోల్ ఏజెంట్లు: ది న్యూ స్టార్ & కో.,
10, వైద్యనాథ మొదలి వీధి, తండియార్పేట, మద్రాసు-21

బోమముడి విరిచాడు.

కమల సంగ్రహంగా విజయవర్మతో తాను వకుళమాలిక చెలికత్తెననీ, ఆయన తాంబూలావసరం గ్రహించి ఆ విధంగా సేవించుకొన్నాననీ సమాధానం చెప్పింది.

ఆమె పరేంగిత జ్ఞానశక్తికి విజయవర్మ లోలోపల వెల్లివిరిసిన ఆశ్చర్యం అతని కళ్లల్లోను, చెక్కిళ్లలోను చిందులు త్రొక్కింది. తలవంచుకుని ప్రసంగిస్తున్న కమలకేసి అలాగే వింతగా చూస్తూ——

"ఎంతటి చాతుర్యం!" అన్నాడు.

"నిజంగా మీరు మెచ్చుకోవలసింది నన్ను కాదు!" అన్నది కమల. సమయం కనిపెట్టి ఆమె ఒక అబద్ధం ఆడింది.

"ఇంకెవరు?"

"దేవదాసి వకుళమాలిక!"

"నిజంగా నిన్నక్కడ నర్తించింది దేవదాసి వకుళమాలికేనా?"

"ఔను!...మొట్టమొదట నేనే మీ మెప్పు పొందాలనుకున్నాను. కాని మీదగ్గర నిజం కప్పిపుచ్చడానికి భయపడ్డాను!"

అన్నది కమల. ఆమె సరిగా అతికినట్టుగా ఇంకొక అబద్ధం చెప్పింది. ఈసారి తన పాచిక పారితీరుతుందని లోలోపల కొంచెం ధైర్యం తెచ్చుకుని అతి జాగ్రత్తగా విజయవర్మ ముఖ కవళిక పరీక్షించింది. ఆమెకు మరి కొంచెం ధైర్యం కలిగింది.

"ఇంతటి నృత్య చాతుర్యం నేనెక్కడా చూడలేదు!" అన్నాడు విజయవర్మ.

కమల "మీ వంటి విద్వాంసులు మెచ్చినదే మెప్పు!——అయినా వకుళమాలికకిది అంతగా అభిమాన విద్య కానే కాదు!" అన్నది.

"అలాగా! మరి ఆమె అభిమాన విద్య?"

"వీణ! ఆ వాద్యంలో గౌడరాజ్యాని కంతటికీ ఆమె మరి అంతటి చెయ్యి లేదని ప్రసిద్ధి కెక్కింది...అయితే మా చెలికత్తెనుగురించి నేనేమి మాటాడినా అతిశయోక్తే అవుతుంది. అది మీవంటివారు పరీక్షించి అనవలసిన మాట!"

"మరి ఇక్కడ ఆ వీణాగోష్ఠి జరగదా?"

"ఇది కేవలం నృత్యోత్సవమే! అది ఇక్కడ జరగదు!"

"ఓహో! అలాగా!" అన్నాడు విజయవర్మ. అంతేగాని ఆ పైన ఆ వీణవినే కుతూహల మేమీ కనబరచనే లేదు!

కమల అలాగే తలవంచుకుని మరి ఒక కర్పూర తాంబూలం అందిస్తూ——

"తమరొక్కసారి మా భవంతికి విజయం చేసి వకుళమాలిక విద్వత్తు పరిశీలించాలని నా కోరిక!" అన్నది.

"ప్రస్తుతం నేనిటువంటి గోష్ఠీ ప్రసక్తి విరమించుకొన్నాను." అన్నాడు విజయవర్మ ముక్తసరిగా.

పాలోచించి——

"మరి స్వామి ఉత్సవాలకు తాము దయ చెయ్యలేదా!" అన్నది విజయవర్మ ముఖ కవళిక గమనిస్తూ.

"నేను కేవలం స్వామి దర్శనం కోసమే ఇక్కడికి వస్తున్నాను! అంతా ఇది కేవలం ఆనుషంగికం!"

"అక్కడకూడా మీ రాలకించేది స్వామి సంకీర్తనమేగదా!" అన్నది కమల!

విజయవర్మ దేవదాసీల గోష్ఠికి దూర దూరంగా ఉండాలని నిశ్చయించుకొన్నాడు. కాని మొహమాటపడి ఆ మాట పైకన లేకపోయాడు. కనక నే కమలఅన్న దానికేమీ సమాధానం చెప్పలేక ఏదో యాదాలాభంగా సాకు చెప్పాలనే ఉద్దేశ్యంతో——

"నిజమే కాని మరి నేటికి వేళ మించిపోయింది!" అన్నాడు.

"పోనీ! రేపు దయచెయ్యవచ్చునే!" అన్నది కమల.

విజయవర్మ కేమీ పాలుపోక——అన్న మాట తప్పడానికిష్టంలేక, మరి గత్యంతరం

"మరి నాలుగైదు రోజులవరకు నా కీ మాత్రిగా తీరికలేదే!" అన్నాడు.

"పోనీ! తమకు తీరిక కలిగినప్పుడే దయ చెయ్యవచ్చును! దానికేమి?" అని సమాధానం చెప్పింది కమల!

విజయవర్మకీ బంధనంలోనించి దాటిపోయేమార్గం కనబడలేదు!

అప్పటికి మాట ఆలోచించుకోవచ్చును గదా అని ఆలోచించి ఎట్టకేలకు 'సరే!' అని అంగీకరించాడు.

కమల సవినయంగా అతనిదగ్గిర సెలవు తీసుకుని –

"తమవంటివారు మా భవంతికి దయ చెయ్యడం కేవలం మా భాగ్యం!" అన్నది.

విజయవర్మ అలాగే పరధ్యానంగా ఆనృత్యమండపం కేసి చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు. కమలకు తన మెడలలో నే ఆ ముత్యాల హారం తళతళ మెరిసినట్లయింది! పిమ్మట వీణా వేణు మృదంగాల సందడిలో వకుళమాలికనృత్యం యథాప్రకారంగా సాగిపోయింది. ——సశేషం.


మీరు ఎప్పుడు రుచి చూడని చాలా మంచికాఫీ...




స్టేన్స్ ఎర్రలేబిల్ ప్యూర్‌కాఫీ మీకు కోరిన రుచి, బలము నాణ్యతేగాక ఎన్నో కప్పుల కాఫీకూడ నిచ్చును ప్రతి ప్యాకేజీపై సేన్సు పేరు చూచి మరీ కొనండి సాటిలేని నాణ్యతకు అదే మీగ్యారంటీ దాని కాపాడనకు చెడకుండా గాలి చొరనట్లు ½ పౌ. 1 పౌ 3 పౌ. 7 పౌ 14 పౌ & 20 పౌనుల టిన్నులలో ప్యాక్ చేయబడినది.

నేడే ఒక టిన్ను కొనండి ఎర్రలేబిల్ ప్యూర్ కాఫీనే కోరండి.

ది యునైటెడ్ కాఫీ సప్లై కంపెనీ లిమిటెడ్,
కోయంబత్తూరు, దక్షిణ ఇండియా

మహబూబ్ నగర్ ఏజెంట్లు మెసర్సు ఎస్ మల్లయ్య & సన్సు జనరల్ మర్చెంట్సు, మహబూబ్‌నగర్.
పశ్చిమ గోదావరి డిస్ట్రిబ్యూటర్లు: మెసర్సు శ్రీపాద నరసింహం బ్రదర్సు, జనరల్ మర్చంట్సు, పోస్టు బాక్సు, నెం 10 కాకినాడ (హెడ్‌క్వార్టర్సు) బ్రాంచీలు. పాలకొల్లు, ఏలూరు.

Stanes
THE PICK OF THE SOUTH
స్టేన్స్ ఎఱ్ఱ లేబిల్ ప్యూర్ కాఫీ
ప్రతి యొక్కరు కొనదగు
చక్కని కాఫీ

# దేవదాసి

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

(గతసంచిక తరువాయి)

### 3

తరవాత నాలుగైదు రోజులలోను కమల విజయవర్మకు కేవలం తాంబూలకరండక వాహిగా వ్యవహరించింది. ఆ యిదవ నాటితో నృత్యోత్సవం ముగిసిపోయింది. ఆనాడు కార్తీక పౌర్ణమి. విజయవర్మకిక తప్పించుకోడానికి మార్గమేమీ గోచరించలేదు.

సాయంత్రం బాగా చీకటిపడినతరవాత వకుళమాలిక గృహానికి తరలిపోయాడు. అతడక్కడికి వెళ్ళేసరికి వకుళమాలిక, ఆమె చెలికత్తెలు వీణావేణుమృదంగాల శ్రుతులు సరిచేసుకొని అతనికోసం ఎదురుచూస్తున్నారు. విజయవర్మ భవంతిద్వారంలోనికి రాగానే వకుళమాలిక స్వయంగా ఎదురేగి అతనిని లోపలికి తోడుకుపోయింది. విజయవర్మ కొంచెంసేపు విశ్రమించి ఇష్టాగోష్ఠిలో వకుళమాలిక వీణావాద్యాల సంప్రదాయాలు వారి విద్వత్తు మొదలైన విశేషాలడిగి తెలుసుకొన్నాడు. కమల యథాప్రకారంగా అతని సరసనకూర్చుని అవసరమైనప్పుడలాగే కర్పూర తాంబూలాలందిచ్చింది.

పిమ్మట కొంతసేపటికి వీణావాద్యం ప్రారంభమైనది.

వకుళమాలికకు పార్శ్వాలలో కూర్చున్న ఇద్దరు యువతులు వీణకు వేణుమృదంగాల శ్రుతి లయలు సమకూర్చారు. వారిప్రక్కనే అమర్చిన బంగారు సత్తికి ప్రతిము ఖోకిలినించి బయలుదేరిన సన్నని అగరు ధూమమాలిక క్రమంగా ఆ ప్రదేశం అంతా వ్యాపించింది. నేలపైపరిచిన రత్నకంబళం మీది రంగులరంగుల చిత్తరువులు దీపకాంతులలో కొత్త కొత్త అందాలొలకబోశాయి. క్రమక్రమంగా వీణావేణు మృదంగనాదాలలో విజయవర్మ హృదయం సమ్మిళితమైపోయింది. అతడు మధ్య మధ్య తాంబూలం సేవిస్తూ తన్మయతతో వకుళమాలిక వీణాగాన మాధుర్యం ఆస్వాదిస్తూ రెప్ప వేయకుండా ఆమెవైపు చూచాడు.

ఇంతవరకు అతనివైపు చూస్తూ వీణ వాయిస్తున్న వకుళమాలిక తటాలున దృష్టి వీణ మెట్లపైకి మళ్లించి వేసింది. ఒడిలోని వీణపై ఆమె కర్ణాభరణాల కాంతులు ప్రతిఫలించాయి. వకుళమాలిక పెదవులపై చిరునవ్వు చిగిరించింది. ఆ నవ్వు క్రమంగా చెక్కిలిపై చిన్ని సుడిలో కలిసి అదృశ్యమైపోయింది! మొత్తం మీద ఆమె ముఖం వర్తులమైనది! చిక్కని చెక్కిళ్లు, వంపులుతేరిన కనుబొమ్మలు! విశాలమైన గుండ్రని నేత్రాలు. కొంచెం చామనచాయ కలసిన ఎర్రని శరీరచ్ఛాయ. వీణావాద్యంలో తన్మయమైన ఆమె అంగుళులు వీణమెట్లపై నృత్యంచేస్తూ ఆ నృత్యమే సంగీతంగా మోగిస్తున్నట్లుగా స్ఫురింప జేశాయి.

విజయవర్మ హృదయంలో ఆ పరిసర వస్తువులన్నీ క్రమక్రమంగా వీణా నాదంలో విలీనమై పోతూన్నట్టు తోడగట్టింది. మధ్య మధ్యవిరామాల్లో అవి తిరిగీ స్వస్వరూపాలు ధరిస్తూ, వీణతీగలు ఝుమ్మని మోగినప్పుడు వెంటనే అవి ఆ నాద తరంగాల్లో మునిగి అదృశ్యమై పోతున్నట్లుగా భాసించాయి. ఆ అగరు ధూప పరిమళము, మనోజ్ఞమైన వీణా నినాదము కలిసి అతని హృదయంలో తీయని మైకం రేకెత్తించాయి. మధ్య మధ్య వకుళమాలిక కళ్యాణి,ఖీర శంకరా భరణము, దేవమనోహరి మొదలైన రాగాలలో గోపికా విరహ గీతాలాలపిస్తూ వీణా వాద్యంలో తన ప్రత్యేక నైపుణి ప్రదర్శించింది. క్రమక్రమంగా ఆమె వీణావాద్యంలో లీనమై విజయవర్మకు తిరిగి వెళ్లిపోయే వేళ మించిపోయిన విషయం కూడా జ్ఞప్తికి రాలేదు కాని కొంతసేపటికి వకుళమాలిక నెమ్మదిగా తనవాద్యం ముగించివేసింది. విజయవర్మ ఆమె చాతుర్యం అనేకవిధాల ప్రశంసిస్తూ తన కంఠంలో రత్నహారం తీసి వీణాగానబహూకృతిగా వకుళమాలిక చేతికందీయబోయాడు. కాని వకుళమాలిక ఒడిలోని వీణ ఒకప్రక్కన ఉంచి మెడవంచి సవినయంగా ఆహారం అందుకొన్నది!

విజయవర్మకిక ఆమె మెడలో ఆ హారం వేయకతప్పలేదు!

ఆమె ఆనందంతో ఉప్పొంగిపోతూ అదేపనిగా ఆ హారం పరిశీలించడం ప్రారంభించింది. అంతలో వేణు మృదంగ వాద్యాలతో వకుళమాలిక వెనకనున్న మహిళలిద్దరు సవినయంగా విజయవర్మ దగ్గర సెలవు తీసుకొని అక్కడినించి వెళ్లిపోయారు. విజయ వర్మకు ఫలాహారం తీసుకువచ్చే మిషతో కమలకూడా మెల్లి మెల్లిగా అక్కడ నించి వెళ్ళిపోయింది. ఇంక వకుళమాలికా విజయవర్మ లిద్దరే అక్కడ మిగిలారు. వకుళమాలిక ఆ హారపరిశీలన ముగించి తల పైకెత్తింది. విజయవర్మ లేచినిలబడి తిరిగి వెళ్లిపోతూ ఆమె కా సంగతి తెలియజేశాడు. అతనితో పాటు ఆమె రెండడుగులు వేసి మెడలోని ఆ హారం తీసి చేతధరించి నిలబడింది. విజయవర్మ కామె మనోభావం కొంతవరకు తెలియకపోలేదు! అయినా ఏమీ ఎరగనట్టుగా అత్యాశ్చర్యంగా ఆమె వైపు చూచాడు!

ఆమె ఆ హారం తిరిగి ఇచ్చివేస్తూ అతని కేసి చూచి అతివినయంగా తలవంచి, "ఈ వేళ నేనీ హారం కోసం మిమ్మల్నిక్కడి కాహ్వానించలేదు!" అన్నది!

విజయవర్మ ఒక నిమిషంసేపు రెప్పపాటు లేకుండా ఆమె ముఖభంగిమ గమనించాడు. ఆమె చెక్కిళ్లలో కెంపులు మెరిశాయి!

# ★ దేవదాసి ★

"అప్రస్తుతం! నా కది తెలియకపోలేదు!" అన్నాడు విజయవర్మ చిరునవ్వులు చిందిస్తూ, "తెలిసి ఉండినా నన్నీవిధంగా కించపరచడం మీకు ధర్మమేనా?" అన్నది వకుళమాలిక వీశాగ్ర దృష్టితో అతనికేసి చూసి.

విజయవర్మ ఒక్క నిట్టూర్పు విడిచి, "నీవన్నది నిజమే! కాని నా చరిత్ర కొంచెం తెలిసి ఉంటే నన్నీ విధంగా నిందించి ఉండవు!" అన్నాడు.

"మీ రహస్యాలు నాకెలా తెలుస్తాయి?"

"రహస్య మేమీలేదు! కాని ప్రస్తుతం కొంతకాలం నేనొక నియమంలో ఉన్నాను! అంతే!"

"నేను మీ నియమానికి భంగం కలిగించ దలుచుకోలేదు." అన్నది వకుళమాలిక మెల్లిగా కళ్ళు వాల్చి.

విజయవర్మ మళ్ళీ కొంచెం ఆలోచనలో పడ్డాడు. అతని కేమనడానికీ పాలుపోలేదు!

"నా మాట వమ్మండి!" అన్నది వకుళమాలిక మళ్ళీ.

"సరేగాని నేనిచ్చిన బహూకృతి తిరస్కరించడం మాత్రం మర్యాదగాలేదు!"

"నేనంత మర్యాద తెలియనిదాన్ని గాదు! కాని నాదొక్క మనవి!" అన్నది వకుళమాలిక తన చేతిలో రత్నహారం పరిశీలిస్తూ.

విజయవర్మ కనుబొమలు ముడివిరిచి ప్రశ్నార్థకంగా ఆమె వైపు చూశాడు.

"ఒక్క పదిరోజులపాటు నా ఆతిథ్యం అంగీకరించ వలసిందని నా ప్రార్థన!"

ఈ ప్రార్థన విని విజయవర్మ కొంచెం ఆశ్చర్యపడ్డాడు.

"మీ దగ్గిర వీణలో కొన్ని గమకాలు నేర్చుకోవాలని—"

"నా కంతటి పాండిత్యంలేదే!"

"మీ వేళ్లు చూచినవా రెవరూ ఆ మాట నమ్మటం కష్టం!"

అన్నది దేవదాసి ఒక చిరునవ్వు నవ్వి. ఆమె అంతకు పూర్వమే అతని ఎడమచేతి తర్జనీ మధ్యమాంగుళులు రెండూ జాగ్రత్తగా పరిశీలించింది. వాటిపై వీణాభ్యాసంచేసే


స్థాపితము: 1920 సంII రం.
సమస్త చర్మవ్యాధులకు,
తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజష్టర్డు)
గోపాలపురం. తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.


వారి వేళ్లమీద కనిపించే గురుతులు కనిపించాయి. ఆ రెండు వేళ్ళకొనలు మొద్దువారి బాగా బిరుసెక్కాయి. వకుళమాలిక చల్లగా ఆ విషయం గ్రహించింది.

విజయవర్మ ఈ ప్రార్థన విని కొంచెం తటపటాయించాడు. "ఇదే మీరు నాకిచ్చే మహాబహూకృతి!" అన్నది వకుళమాలిక మళ్లీ!

విజయవర్మ ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఇన్నాళ్ళనించీ అతడా నగరంలో ఒక పెద్ద ధర్మశాలలో ఎవరో పైదేశంనించి వచ్చిన పరదేశిలా నివసిస్తున్నాడు. అక్కడి వసతి సదుపాయాలేవీ అతనికి రుచించలేదు! పైగా తాను కొంత గుప్తంగా దాచిన విషయాలన్నీ అక్కడ ఉండడంవల్ల నలుగురికీ తెలిసిపోతున్నాయని కూడా స్పష్టపడిపోయింది. తన ప్రచ్ఛన్న జీవితానికి వకుళమాలిక గృహనివాసం బాగా వీలుపడగలదని కూడా అతడు గ్రహించుకొన్నాడు. అదీగాక తన లోలోపలి సంకల్పం నెరవేర్చుకోడానికి కూడా ఆమె భవంతిలో నివసించడం చాలా అవసరం! పైగా వకుళమాలిక కేవలం పాదదాసిలా మసులుకుంటూ అన్ని విధాలా అతనికి చేదోడు వాదోడుగా సాయం చేయగలదు!

ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించి ఎట్టకేలకు విజయవర్మ ఆమె ఆతిథ్యం అంగీకరించాడు. అయితే అంతమాత్రానికే దేవదాసి లోలోపల ఉప్పొంగిపోయింది.

వెంటనే లోపలికివెళ్లి అతి రహస్యంగా కమలకీశుభవార్త తెలియజేసింది! కాని వకుళమాలికను రెండు మూడు ప్రశ్నలడిగిన పిమ్మట వకుళమాలికగాని, తానుగాని అంతగా ఉప్పొంగి పోవలసిందేమీ లేదని ఆమె గ్రహించివేసింది! అయినా అంతమాత్రంతో నిరుత్సాహం చెందక తమ భవంతిలో విజయవర్మకు వేరే వివిక్తంగా ఒక వసతిగృహం ఏర్పాటుచేసి దానిలో ఏ లోపము లేకుండా అన్ని సదుపాయాలు అమర్చింది!

విజయవర్మ వెంటనే భోజనాదికం ముగించుకొని ఆ వసతిగృహంలో హంసతూలికా తల్పంపై పవ్వళించాడు! అతనికి ఈ పాండ్రవర్ధన నగరము, ఈ చిత్రవిచిత్ర ఘటనలు అత్యాశ్చర్యకరంగా కనిపించాయి! పిమ్మట వకుళమాలిక కూడా భోజనాదికం ముగించుకొని తన ప్రత్యేక శయ్యాగృహం లోనికి వెళ్లిపోయింది.

ఆ నాటి పున్నమి వెన్నెలకడలిలో ప్రపంచంఅంతా ఒక నౌకలాగ తేలిపోతూన్నట్టు కనిపించింది! కొన్ని వెన్నెల వెలుగులు గవాక్షాలగుండా వకుళమాలిక శయ్యపై ప్రసరించాయి.

ఆమె ఆ వెన్నెలకేసి చూస్తూ వేడి నిట్టూర్పులు విడిచింది. ఆ తూలతీగల చిగుళ్లపై నిలిచిన చిన్న చిన్న మంచు బిందువులా వెన్నెలలోమంచి ముత్యాలలాగ తళతళ మెరిసిపోతున్నాయి. చెట్లపై అల్లిబిల్లిగా అల్లుకుపోయిన సాలెగూడులు కూడా ఆ వెన్నెలలో వెండిగూళ్లలా మెరిసిపోతున్నాయి. చెట్లకింది నీడలు చీకటి పేళ్ళ కొన్నట్టుగా నిగనిగ లాడుతున్నాయి. ఆకాశం అంతా గిల్లుపూలరేకులు రాలుతూన్నట్టు మెరిసిపోయింది. ఆ కార్తికపూర్ణిమ - తెల్లని మంచుమేలి ముసుగు ధరించి మెమ్మదిమెమ్మదిగా సాగిపోతున్న రమణీయాభిసారికగా స్ఫురించిందా దేవదాసికి!

లోకం అంతటా పాలవెన్నెలలే! కాని వకుళమాలిక హృదయంలో కేవలం గాఢాంధకారం మాత్రమే అలుముకుపోయింది!

వకుళమాలికకిప్పుడు కలిగినంత హృదయాఘాతం ఇంతకుపూర్వం ఎన్నడూ కలగలేదు! పూర్వం పాండ్రవర్ధన నగరంలోని కుబేరులెందరెందరో ఆమెకు పాదాక్రాంతులైనారు. మరి నేడు! కాశ్మీరుసైన్యంలోని ఒక సామాన్యయోధుని కామె పాదాక్రాంతురాలయింది. అయినా అతడామెను తృణప్రాయంగా పరిగణిస్తున్నాడు! ఏమి విచిత్రమైన విధివైపరీత్యం!

ఆమెకావిషయం ఆలోచిస్తుంటే అతడు వాస్తవంగా సైన్యంలో సామాన్య యోధుడేనా అని సందేహం కలిగింది. సామాన్య క్షత్రియయోధునికీ కళావైదుష్యం ఎలా కలిగింది? అతడెవరైనా రాజబంధువా? లేక ఎవరైనా దేశాధీశుడా? అయితే ఈ ప్రచ్ఛన్న వేషం ధరించనేల? ఆనియమంఅవలంబించడానికి కారణమేమో? ఆ రత్నహార బహూకృతినిబట్టి పరిశీలిస్తే అతడెవరో సంపన్నుడైన రాజబంధువే అయిఉండాలి! లేకపోతే అంతటి అమూల్యమైన రత్నహారం ఒక సామాన్యయోధుడెలాగ సంపాదించగలడు? అతడెంతటి ధీరచిత్తుడు! అయినా ఎంతటి ఆర్ద్రహృదయుడు!

వకుళమాలిక ఈవిధంగా పరిపరివిధాలుగా ఆలోచనలు సాగించింది! ఎంతసేపటికీ ఆమెకు నిద్రపట్టలేదు. ఒకసారి లేచి కూర్చుని కార్తీకపౌర్ణమి పండువెన్నెల తళతళలు పరిశీలించింది. వేడిగా ఒక పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టింది!

ఇంతలో ఎవరో గట్టిగా ఆమె కళ్లు మూశారు! ఎంతగా ప్రతిమాలుకొన్నా విడిచిపెట్టలేదు! మొదట విజయవర్మే వెనకాలేవచ్చి కళ్లుమూసి ఉండవచ్చునని ఆమె ఊహించింది! చేతులు తడిమిచూచింది. అవి కొంచెం మృదువుగా తగిలాయి! కమలే

## త్వరలో ప్రారంభం

### బాలసాహితి కొత్త సీరియల్

# "సాగరగర్భంలో సాహసయాత్ర"

### ఉత్సాహోద్రేకాలు, వినోదవిజ్ఞానాలు కలిగించే
### విచిత్ర వైజ్ఞానిక నవల

ఫ్రెంచి రచయిత జూల్స్ వెర్న్ రచించిన "ట్వెంటీ థౌజండ్ లీగ్స్ అండర్ ది సీ" నవల అనువాదంగా "సాగరగర్భంలో సాహసయాత్ర" అనే కొత్త సీరియల్ ఆంధ్ర వారపత్రిక బాలసాహితి శీర్షికలో త్వరలో ప్రచురిస్తున్నాము

జలాంతర్గామి నౌకల్ని కనుగొనడానికి 30 ఏళ్ల ముందే జలాంతర్గామిని ఊహించి, సాహసపూరితమైన గాథతో జూల్స్ వెర్న్ ఈ నవల రచించాడు. సముద్రాంతరాళంలోని అద్భుతజీవిత రహస్యాలను కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఈ కథ పాఠకులను భూగోళంలోని దూరదూర ప్రాంతాలకు తీసుకుపోయి విస్మయ చకితుల్ని చేస్తుంది.

వారం వారం ఆంధ్ర వారపత్రికలో ఈ సీరియల్ చదివి ఆనందించండి.

అయివుంటే వచ్చునని ఊహించి 'కమలా!' అని పిలిచింది. చెవిదగ్గర మెల్లిగా "విజయవర్మ" అనే అక్షరాలు వినిపించాయి! వకుళమాలిక గుండె జల్లుమంది! గాయశక్తులా ప్రయత్నించి పట్టు విడిపించుకొని వెనక్కి తిరిగి చూచింది! విజయవర్మే అయివుండవచ్చునని మనసారా ఆశించింది! కాని ఆమె కమల!

"ఎందుకే ఇంతటి రాత్రి వేళ ఇలా వచ్చావు!"

"చాలా చక్కని రత్నహారం సంపాదించావే! మరి నాముత్యాలహారం మాట!"

వకుళమాలిక వెన్నెల కేసి చూసి ఒక నిట్టూర్పు విడిచింది కమల ఆమె నోదారుస్తూ—"నీకే లేనిపోని దిగులెందుకు? ఈవంట ఇంటి మంచెలిక ఎక్కడికీ పోదులే!" అంది.

"నా హృదయానికిమాత్రం ఇదంతా ఒక శూలంగా పరిణమించింది! "ఆ హారం లేకపోతే నా హృదయంలోను శూలం గుచ్చుకున్నట్టే ఉంది! దీనికేమంటావు?"

వకుళమాలిక ఒక్క చిరునవ్వు నవ్వి మెడలో హారం తీయబోయింది "పోనీ తరవాత తీసుకుంటానులే! ఇంతకీనీవాశించినట్టే ఆవిజయవర్మే ఇక్కడికివస్తే! నీసొగసుచూసి ధైర్యం చిక్కబట్టడం మాటలతో పనిగాదు!" అన్నది కమల

వకుళమాలిక మెల్లిగా ఆమె చెంపమీద ఒకటి వడ్డించింది! కమల ఆతరవాత రెండో బహుమతి అందకుండా తొందరగా అక్కడినుంచి పారిపోయింది!

౪

విజయవర్మ తన భవంతిలో ఉన్న పది రోజులకాలము వకుళమాలికకొక క్షణంలా గడిచిపోయింది ఆమె అతనిదగ్గర వీణా వాద్యంలో ఎన్నెన్నో నూతనవిశేషా లభ్యసించింది. అయితే అతనిముఖభావంలో మాత్రం మార్పేమీ గోచరించలేదు! విజయవర్మ పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలని కమల ఎన్నెన్నోవిధాల ప్రయత్నించింది. అతడొక్క చిరునవ్వు నవ్వి తాను సామాన్యయోధుడననిమాత్రమేనని చెబుతూండేవాడు! కాని కమలా వకుళమాలిక లిది విశ్వసించలేకపోయేవారు. ఆపదిరోజులు ముగిసిపోయినతరవాత విజయవర్మ తిరిగి స్వస్థానానికి వెళ్ళిపోవాలని అన్నాడు. కాని కమల, వకుళమాలిక అనేకవిధాలుగా బతిమాలుకోవడంవల్ల చిట్టచివరికి ఇంకొంతకాలంపాటు భవంతిలోనే నివసించడాని కంగీకరించాడు. అంతమాత్రమే చాలుననుకొని వకుళమాలిక లోలోపల ఎంతో సంతోషించింది.

విజయవర్మకు వకుళమాలిక భవనంలో సామాన్యంగా వీణా నృత్యాది గోష్ఠులతోనే కాలం అంతా గడిచిపోయేది. సాయంకాల

# ★ దేవదాసి ★

వేళ మాత్రం అతడు నగరోద్యానవనం వైపు వాహ్యాళికి వెడుతూండేవాడు ఆ భవనంలో వకుళమాలికకు, కమలకు తప్ప మిగిలిన వారికి ఎవరికీ అతడెవరో తెలియదు; వారి కిద్దరికి తెలిసినది కూడా అంతంత మాత్రమే! అయినా వారిక ఆవిషయం తెలుసుకోవడానికేమీ ప్రయత్నించ దలుచుకోలేదు! ప్రయత్నించినా ఫలితమేమీ కలుగదని వారికి తెలిసిపోయింది. కనకనే వారీవైఖరి అవలంబించారు. అయితే వారి హృదయాలలో మాత్రం అతనిని గురించిన జిజ్ఞాస అలాగే పీడిస్తూండేది.

ఒక నాడు విజయవర్మ యథాప్రకారంగా వాహ్యాళికి బయలుదేరాడు. వకుళమాలిక అతని దగ్గరకు వచ్చి ఆనాటి నించి కొంత కాలం వరకు వాహ్యాళికి వెళ్ళవద్దని ప్రార్థించింది. మొదట ఎంత గుచ్చిగుచ్చి అడిగినా ఆమె అసలు కారణం చెప్పనేలేదు. కాని చివరికి చెప్పక తప్పలేదు! ఆమె ఆ విధంగా వాహ్యాళికి వెళ్ళవద్దని నివారించడానికిగల అసలు కారణం ఇది.

ఒక వారం పది రోజులనించీ పాండ్రవర్ధన నగరంలో ఒక అపూర్వమైన భయోత్పాతం బయలు దేరింది. ఆ పట్టణానికి సమీపంలో ఉన్న అరణ్యంలో నివసించే సింహం ఒకటి నగరంలో ప్రవేశించి విచ్చలవిడిగా సంచరించడం మొదలు పెట్టింది. మొదట అది అంతగా పౌరుల కపకారం చెయ్యలేదు. కాని కొంచెం మనుష్య రక్తం చవి చూచిన తరవాత రోజురోజు ఇద్దరు ముగ్గురు పౌరులను పొట్టబెట్టుకో సేది. కన్నుమూసి తెరిచేలోగా పట్టణంలో ప్రవేశించేది! మళ్లీ మెరుపులా ఎక్కడో మాయమై పోయేది! ఈలోగా ఇద్దరు ముగ్గురు పౌరుల సంహారం జరిగిపోయేది! ఎంత ప్రయత్నించినా ఎవరూ దానిని వేటాడలేక పోయేవారు చివరికి ప్రాణంవిసిగి పౌండ్రవర్ధనరాజు జయంతు డాసింహాన్ని సంహరించిన వారికి రత్నఖచితమైన ఖడ్గం బహూకరిస్తానని పట్టణం అంతటా చాటింపించాడు. ఈ ఘోషణ కర్ణాకర్ణిగా వకుళమాలికకు తెలిసింది యథాప్రకారంగా వాహ్యాళికి వెళ్లనప్పుడీసింహం వల్ల విజయవర్మకు ప్రాణాపాయం కలగగలదేమోనని ఆమె భయం! ఆ విషయం కొంచెం తెలిస్తే అతనే ఆ సింహాన్ని వేటాడడానికి బయలుదేర వచ్చును. అతని సాహసం అంతటిది! అందుచేత వకుళమాలిక అతనికా విషయం చూచాయగానే తెలియనీలేదు. అంతేకాని జయంతుని చాటింపు మొదలైన విషయాలేవీ తెలియజెయ్యనే లేదు!

ఆమె ఆ విషయం చెప్పగానే విజయవర్మ వెంటనే తన వసతిగృహంలోనికి వెళ్లిపోయాడు. ఇక ఆనాటికి వాహ్యాళి నిలిచిపోయినట్లే గదా అని ఆమె లోలోపల ఎంతో మురిసిపోయింది.

కాని ఒక అరగడియ తరవాత విజయవర్మ నఖశిఖ పర్యంతము కవచం ధరించి యుద్ధ సన్నద్ధమైన యోధవేషంతో మళ్లీ వాహ్యాళికి బయలుదేరాడు. వకుళమాలిక అతనికి ఎదురుగా వచ్చి నిలబడింది దీనంగా విజయవర్మ కేసి చూసి "ఈమాటికి నామాట మన్నించండి!" అంది

విజయవర్మ పకపక్కన నవ్వాడు:

"సింహంవల్ల నాకు ప్రాణాపాయం కలుగుతుందనేనా నీ భయం?"

"అది అప్పుడే ఎంతో మంది యోధులను నాశమార్చివేసింది!"

"అయితే ఇక నాచేతిలో పడి హత మారి పోతుంది!"

"నిజమే కాని, పోనీ నాలుగు రోజులు వాహ్యాళి మానగూడదా?"

"పోనీ నేనీవేళ ఆ సింహం జోలికి పోను లే!" అన్నాడు విజయవర్మ నవ్వుతూ.

"అది ఆ ఉద్యాన ప్రాంతంలోనే తిరుగుతూం దే!"

"అయితే మరింత మంచిది!"

"అంతేనా! మరి నామాట మన్నించరా!" అన్నది వకుళమాలిక జాలిగా అతనివైపు చూసి.

"ఎందుకింత తొందరలు! నాకేమీ భయం లేదులే! క్షేమంగా తిరిగి వచ్చివేస్తాను! నన్ను పోనీ!" అన్నాడు విజయవర్మ.

ఆమె ఇక మారు చెప్పలేదు! అతడు కను చూపు మేర దాటిపోయేవరకు రెప్పపాటు లేకుండా అలాగే నిశ్చలంగా నిలబడి పోయింది ఆమె చెంపలమీద రెండుకన్నీటి బిందువులు మెల్లదిగా దిగజారాయి

విజయవర్మ ఆవేళ ప్రత్యేకంగా సింహాన్ని సంహరించే తీరాలని బయలుదేరలేదు కాని అతనికి నగరం అంతా ఆనాడా సింహభయం మూలాన పాడుపడినట్లు కనిపించింది. జనసంచారం పూర్తిగా స్తంభించిపోయింది. పూర్వం నగరోద్యానవనద్వారంలో వటవృక్షం నీడలో అమర్చిన శిలావేదికలమీద చాలామంది పౌరులు కనిపించేవారు. నేడు అక్కడక్కడ ఇద్దరు ముగ్గురు యోధులు మాత్రమే నిలబడి ఆ ప్రాంతం అంతా సంరక్షిస్తున్నారు.

విజయవర్మ అక్కడ ఒక శిలావేదికమీద



ఈ నెల 9వ తేదీన కీర్తిశేషులైన
కళాప్రపూర్ణ
శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులు.

కూర్చున్నాడు ఆనాడా పరిసరమే కాక అతని హృదయం కూడా శూన్యమై పోయినట్లే తోచింది

అంతలో అతనికొక భయంకరమైన సింహగర్జన వినిపించింది! వెంటనే పక్కకు తిరిగిచూచాడు ఆ ప్రాంతం సంరక్షిస్తున్న యోధుడాసింహం పంజాకిందపడి జాలిగా ఆర్తనాదం చేశాడు! విజయవర్మ తటాలున ఒరలో వేలాడుతున్న బాకు పైకితీశాడు! సింహం ఆ యోధుని సంహరించివేసిన తరవాత వెంటనే అక్కడ విజయవర్మ ఉనికి పసిగట్టివేసింది, క్షణంలో మెరుపులా అతనిమీదికి లంఘించింది!

విజయవర్మ ఎడమ మోచేయి సింహం నోటికందించాడు సింహం అది నోటితో గట్టిగా కరిచిపట్టింది. కాని దానికి చుట్టూ దట్టమైన ఉక్కుకవచం ఉండడంవల్ల అది సింహానికి కొరకబడలేదు. ఈలోగా విజయవర్మ కుడిచేతి బాకుతో సింహంకళ్లు రెండు పొడిచివేశాడు! తరవాత శక్తికొద్దీ దాని శరీరం అంతటా బాకుతో పొడిచి గాయపరిచాడు

సింహం శరీరం అంతా రక్తమయమై పోయింది! అయినా అది అతన్ని అనేక విధాలుగా గాయపరిచింది. కాని కళ్లు కనబడకపోవడంవల్ల, బలమైన బాకు పోట్లు తగలడంవల్ల క్రమక్రమంగా నీరసించిపోయి భయంకర గర్జనలతో అక్కడే పడిపోయి చనిపోయింది. విజయవర్మ చివరిదాకా చాలా జాగ్రత్తగా గాయాలు తగలకుండా తప్పించుకున్నాడు. కాని చిట్టచివర సుమా

## చెప్పుదెబ్బ

తన బట్టలు తనే ఉతుక్కునే తోటి విద్యార్థిని కామెయ్య బోయిన ఒక గోరోజనరావు, హేళనగా నవ్వుతూ, "మా యింట్లో, ఎవరిబట్టలు వాళ్లు చచ్చినా ఉతుక్కోరు తెలుసా?" అన్నాడు.

"అంటే! ఊళ్లోవాళ్లవి ఉతుకుతారా?" అన్నాడు కాయకష్టంలో గొప్పతనం గుర్తెరిగిన మరో విద్యార్థి

కొక గడియవరకు జరిగిన భయంకర యుద్ధంలో సింహం పంజా దెబ్బలవల్ల అతనికి కూడా కొన్ని గట్టి గాయాలు తగిలాయి. సింహం చనిపోగానే వీలైనంతవరకు తానే తన గాయాలకు కట్టు కట్టుకొని తూలుతూ తూలుతూ నడుస్తూ మెల్లిగా వకుళమాలిక భవంతి సమీపానికి చేరుకున్నాడు. మేడ మీదనుండి అతనికోసం ఎదురు చూస్తున్న వకుళమాలిక కొంతదూరంలోనే అతని పరిస్థితి కనిపెట్టి పరిచారకుల సహాయంతో అతనిని భవంతిలోనికి తీసుకు వచ్చింది. అతడు అతి కష్టంమీద ఆ భవంతిలోపలికి చేరుకోగలిగాడు. వకుళమాలిక ఒక శల్యవైద్యునిచేత వెంటనే అతని గాయాలన్నిటికీ కట్టు కట్టించి స్వయంగా అతనికనేక విధాలుగా పరిచర్య చేసింది.

విజయవర్మ బాగా అలిసి పోయాడు. శల్యవైద్యుడతనికి తగిలిన గాయాలంతగా ప్రాణాపాయకరమైనవి కావనీ త్వరలోనే నయమై పోవచ్చుననీ చెప్పి తిరిగి వెళ్లిపోయాడు. ఎక్కువ బడలికవల్ల అతని కన్నులు మూతపడి పోయాయి.

బాగా చీకటి పడిపోయింది. ఎంత ప్రయత్నించినా అతనికి నిద్ర పట్టలేదు. వకుళమాలిక తన యెడల చూపించిన ఆదరానురాగాలకతని హృదయం ద్రవించిపోయింది. ఎక్కడి కాశ్మీర దేశము! ఎక్కడి గౌడ దేశము! తానేదో ధర్మశాలలో నివసిస్తూ కాకతాళీయంగా కార్తికేయ దేవాలయంలో వకుళమాలిక నృత్యం సందర్శించడం జరిగింది. అంతే! ఆమె తన భవంతి కాహ్వానించి ఎన్నో విధాలుగా కంటికి రెప్పలా కాపాడింది. కేవలం తన ధనాని కాశించి, ఆ విధంగా గౌరవించిందని అనుకోడానికి కూడా వీలులేదు! ఆమె కన్నులలో అనుక్షణము అనురాగం వెల్లివిరుస్తూనే ఉన్నది. అతడామె యెడల కేవలం తటస్థభావమే అవలంబించాడు. అయినా ఆమె అనురాగంలో భేదమేమీ కనిపించలేదు! పైగా అది క్రమంగా ఇనుమడించి ప్రస్ఫురించింది. తన హృదయాంతరాళంలో దాచివేసిన గుప్త రహస్యం ఒకవేళ ఆమెకు తెలిసిపోయిందా? అది ఆవిధంగా తెలియడానికెక్కడా ఆస్కారంలేదే!

ఆమె దేవదాసి. పౌండ్రవర్ధన నగరంలో ఆమెతో సరిపోల్చదగిన వారిని వేళ్లతో లెక్కపెట్ట వచ్చును. ఆమెకు ధన ధాన్యాలకు, భోగ భాగ్యాలకు దాసదాసీ జనానికీ కొదవలేదు! మరి స్త్రీ జనం సామాన్యంగా అర్థించే అలంకారాలు, సౌందర్యం, యౌవనం అన్నీ ఆమెకు కొల్లలు! అంతే దేవదాసీకులంలో అనురాగమనేది కేవలం గగన కుసుమం! ఆమె తన యెడల కనబరిచే అనురాగం అంతా నిజంగా సహజమైనదేనా? కాని నా వీనటవల్ల ఆమెకు కలిగే ప్రయోజనమేమిటో! అయితే ఇంత ఆప్యాయంగా తననీవిధంగా ఆదరించడానికి కారణం?

ఈవిధంగా అతని ఆలోచనలనేకవిధాలుగా సాగిపోయాయి!

విజయవర్మకు క్రమక్రమంగా కొంత అలసట తగ్గింది. మెల్లిగా కళ్లు తెరిచిచూచాడు. ఎదురుగా దీపకాంతిలో వకుళమాలిక! ఆమె నేడెంతో చక్కగా అలంకరించుకొన్నది. నిశ్చలంగా తనముఖం పరిశీలిస్తున్నది. తన శయ్యపై సరసనకూర్చుని మోచేతిపై తగిలిన గాయానికి కట్టుకట్టి అది మెల్లిగా నిమురుతున్నది.

తాను కొంచెం కన్నులు తెరవగానే తటాలున కన్నులింకొకపక్కకు తిప్పివేసింది. మెల్లిగా ఇలాగ అడిగింది.

"బాధ ఏమైనా కొంచెం తగ్గిందా?"

అతడు కొంతవరకు తగ్గిందని చేతితో సూచించాడు.

"ఎంతటి ఘోరవిపత్తుగడిచి బయటపడ్డారు!"

విజయవర్మ పెదవులపై ఒక చిన్న చిరునవ్వు వికసించింది! వకుళమాలిక చెంపలపై రెండు కన్నీటిబిందువులు మెరిశాయి. కాని అవి కనబడనీయకుండా వెంటనే ఆమె ముఖం తిప్పివేసుకొన్నది. అలాగ కొంతసేపుండి, మాటాడకుండా మౌనభాషలోనే అతనిదగ్గర సెలవు తీసుకుని మెల్లిగా అక్కడినించి వెళ్ళిపోయింది. విజయవర్మ మెల్లిగా కళ్లుమూసి నిద్రించాడు.—సశేషం

## స.బ.బు


ఒక దొంగ, తాపీగా ఓ ఇల్లు చక్కబెడుతూ, కావలసినవన్నీ సంచీలో వేసుకుంటున్నాడు. చప్పుడు విని మేలుకున్న ఇంటి యజమాని, మెల్లిగా ఓ కర్ర పట్టుకు వచ్చాడు.

"ముందా సంచిలో సరుకంతా అక్కడ దిమ్మరించి మరీ కదులు" అని గదమాయించాడు.

దొంగ చిత్తరపోయి, తమాయించుకున్నాడు.

"సంచిలో సరుకులన్నీ ఇక్కడే ఒదిలెయ్యమనడం సబబు కాదండీ. ఇందులో పక్కింటివాళ్లవి కొన్ని ఉన్నాయి" అన్నాడు తాపీగా.


తెలుగు ఆంగ్ల భాషాబోధిని





తెలుగు చదువ తెలిసినవారెల్లరు ఈపుస్తకంతో ఇతరుల సహాయం లేకనే ఇంగ్లీషుభాష సులభంగా చదువను, వ్రాయను, మాట్లాడను, పత్రప్రత్యుత్తరాలు జరపను నేర్చుకోవచ్చును. ఒక పెద్ద కాలికో బైండు పుస్తకం రు. 5/- వి. పి. రు. 1-2-0.

కొక్కోకము: ఇది అసలైన కొక్కోక గ్రంథము. ఫోటోలతో ఉన్నది— రు. 1/- వి. పి. రు. 0 12-0.

Vani Book Depot. P. B. No. 239, Madras 1

16 జ్యూయల్సు చేతిగడియారం రు. 5



స్విస్ తయారీ. 16 జ్యూయల్సు నాజూకైన చేతిగడియారం. 10 ఏళ్ల గ్యారంటీ. ధర రు. 5. పోస్టేజి రు 1/8- అదనం. Swiss Watch Suppliers P. B 1392, (A, P. M )Delhi.

# దేవదాసి

(గతసంచిక తరవాయి)

**8**

సింహాన్ని ఎవరో మహా ధైర్యశాలి సంహరించి వేశాడనీ, కాని ఆ సంహరించిన మహావీరు డెవడో పౌండ్ర వర్ధనరాజు చాటింపించిన రత్నఖచితఖడ్గం స్వీకరించడానికి కూడా రాలేదనీ పౌండ్ర వర్ధన నగరంలో వదంతులు బయలుదేరాయి. క్రమంగా నాలుగయిదు రోజులు గడిచే సరికి ఆ వదంతులు చిత్రచిత్రంగా చిలవలు పలవలు వేశాయి. నగరం నగరం అంతటా ఇదే వార్త. ఆ వీరుడెవడో దేవదాసి వకుళ మాలిక గృహంలో నివసిస్తున్నాడనికూడా కొందరు పసిగట్టారు. కాని ఎవ్వరికీ అతని దర్శనభాగ్యం లభించలేదు!

అయిదారు రోజులు గడిచేసరికి విజయ వర్మ గాయాలు బాగా మానిపోయాయి. అతడు తన వసతిగృహంలో కొంచెం అటు, ఇటు పచారుచేయ గలుగుతున్నాడు. కాని ఇంకా పూర్తిగా బలం కలగలేదు.

ఆ మరునాడు ప్రాతఃకాలమే వకుళమాలిక విజయవర్మ దగ్గరకు వచ్చింది. ఆనాడామె ముఖంలో ఏదో నూతనోత్సాహం వెల్లివిరిసింది.

విజయవర్మ కా నూతన వైఖరికి కారణం తెలియలేదు! వకుళమాలిక లోపలికి వస్తూనే అతనితో ఇలాగన్నది.

"మీ రెవరో నాకు తెలిసిపోయిందిలెండి!" విజయవర్మ ఈమాటకు దిగ్భ్రాంతు డయినాడు.

"ఎవరు చెప్పారు?"

"ఎవరో చెప్పనక్కర లేదు! నాకే తెలిసింది! మీ హస్తంలోని సామ్రాజ్య రేఖలే చెబుతున్నాయి!"

ఈ మాటతో అతనికి తిరిగి కొంచెం ఊరట కలిగింది.

"నీకు సాముద్రికంలో కూడా ప్రవేశం ఉందా?"

"ఏదో కొంచెం ఉంది."

తరవాత అతడామెకు కుడిచేయి అందిచ్చాడు. అది ఆమె ఎంతో ఆప్యాయంగా చేతితో పట్టుకొన్నది! ఇన్నాళ్లనుంచీ విజయవర్మ ఆమెకు స్పర్శావకాశమైనా కలగకుండా దూరదూరంగా తొలగిపోతు న్నాడు. అతనికి గాయాలకు కట్లు కట్టి నప్పుడుమాత్రమే ఆమెకతని స్పర్శభాగ్యం లభించేది. ఇప్పు డతడే స్వయంగా చేయి అందిచ్చినందు కామె లోలోపల ఎంతో మురిసిపోయింది. సాముద్రిక పరిశీలన మిషతో చాలా సేపటివరకు ఆమె అతని హస్తస్పర్శానందం అనుభవించింది. ఆ హస్తం స్పృశించగానే ఆమె శరీరమంతా ఒక్కసారిగా జల్లని పులకరించింది. అలాగ కొంతసేపతని హస్తరేఖలు పరిశీలించి ఒక్క చిరునవ్వు నవ్వి అతని ముఖవైఖరి పరీక్షిస్తూ మెల్లిగా ఇలాగన్నది: "మీరు సామాన్య యోధులు మాత్రం కారు! అది నాకిప్పుడు తెలిసిపోయింది! మీరు సాక్షాత్తు కాశ్మీర దేశాధీశ్వరులు! మీ నామధేయం జయాపీడ చక్రవర్తి!"

## పావన గాథాలహరి

ఈ మాట వినగానే విజయవర్మ నోట మాట లేక అలాగే నిర్ఘాంతపోయాడు!

"ఇది నీకెలాగ తెలిసింది?"

"నేను చెప్పినది నిజమేనా?"

"ముందు నే నడిగినదానికి సమాధానం చెప్పాలి!"

"నా ప్రశ్నకు సమాధానం చెబితే నేగాని నేను చెప్పను!"

వకుళమాలిక మాతి బిగించింది.

పి. గణపతిశాస్త్రి

విజయవర్మ కొంచెంసేపు తటపటాయించి నెమ్మదిగా—

"నీ వన్నది నిజమే! కాని నీకీ విషయం ఎలాగ తెలిసింది!" అన్నాడు.

"మీ హస్తరేఖలే చెబుతున్నాయి!" అన్నది కొంచెం కొంటెగా.

"నా హస్తరేఖలవల్ల కొంతవరకు భాగ్య భోగాలు తెలుసుకోవచ్చును! అంతేకాని నా పేరెలాగ తెలిసింది?"

"నగరంలో కొందరికి మీవృత్తాంతం కర్ణా కర్ణిగా తెలిసిపోయింది!"

జయాపీడు డీ మాటలు విని ప్రాన్పడి పోయాడు.

"నగరంలో ఈ సంగతి ఎలాగ పొక్కిందో!"

"మీ రా సింహాన్ని సంహరించినపుడు మీ మోచేతి కవచం దాని కోరలలో చిక్కు పడి పోయింది. మరునాడు రాజభటు లా కవచం పరిశీలించారట! దాని లోపలి భాగంలో మీ నామధేయం కనబడినదట! ఇప్పటి కయినా యథార్థం తెలియజేస్తే మీప్రాణ సంరక్షణ కేదైనా ఉపాయం ఆలోచించవచ్చును! ఆపైన తమదయ!"అని ఎంతో జాలిగా ఆమె అతని కేసి చూసింది. జయాపీడు డిక నిజం కప్పిపుచ్చడంవల్ల ప్రయోజనం లేదని ఆమెతో తన విషయంఅంతా ఆమూలాగ్రంగా పూస గుచ్చినట్లు చెప్పివేశాడు. అత డామెతో చెప్పిన స్వీయవృత్తాంతం ఇది:

కాశ్మీరచక్రవర్తి జయాపీడదేవుడు రాజ్యాధికారం చేజిక్కించుకొన్న కొన్ని నెలల్లో నే తన రాజ్యానికి దక్షిణదిశలో ఉన్న రాజుల నందరినీ జయించవలెనని నిశ్చయించి సైన్యాలతో దక్షిణ దిగ్విజయయాత్రకు బయలు దేరాడు.

అతడా సైన్యాలతో కలిసి కాశ్మీర రాజధాని సింహద్వారం దాటి పోతూంటే పౌరులందరు ముక్తకంఠాలతో జయ జయ ధ్వానాలు చేశారు. జయాపీడుని పితామహుడు లలితాదిత్యుడు కూడా ఒకసారి

# ★ దేవదాసి ★

ఈవిధంగా దిగ్విజయయాత్రకు బయలుదేరాడు. సేనానాయకులలో వృద్ధులు కొందరా నాటి వైభవం అంతా జయాపీడునికి కన్నులకు గట్టినట్లు వర్ణించి చెప్పారు. అప్పుడు లలితాదిత్యచక్రవర్తి సపాదలక్ష కర్ణీరథాలతో దిగ్విజయయాత్రకు బయలుదేరాడనీ తమకిప్పుడు ఎనభైవేల కర్ణీరథాలే ఉన్నాయనీ అయినా తమయోధులు పూర్వపు యోధులకంటె శస్త్రవిద్యలో ఆరితేరినవారనీ అందుచేత నాటికంటె నేటి దిగ్విజయం సులభతరం కాగలదనీ వారతనికి సవినయంగా విన్నవించారు.

జయాపీడు డా సేనావాహినితో క్రమక్రమంగా కాశ్మీర రాజ్యానికి దక్షిణ భాగంలో ఉన్న రాజుల నందరినీ జయించివేశాడు.

కాని క్రమక్రమంగా ఆ సేనావాహిని ఇంకా ముమ్ముందుకు చొచ్చుకుపోయిన కొద్దీ ఆ సైన్యం చాలావరకు తరిగిపోయింది. మార్గంలో జరిగిన ఘోరయుద్ధాలలో చాలామంది సైనికులు యుద్ధభూమిలో మరణించారు.

క్రమక్రమంగా గౌడదేశం సరిహద్దులలో ప్రవేశించేసరికి సైన్యంలో మిగిలినవారు పాతికవేలమందికంటె ఎక్కువ లేదు. ఇంతలో కాశ్మీర రాజ్యానికి జ్ఞాతులవల్ల కొంత అలజడి కలిగే సూచనలు కనిపించాయి. మిగిలిన సైన్యంలో సగానికిపైగా రాజధానీ సంరక్షణకోసం తిరిగి కాశ్మీరరాజ్యానికి తరలిపోయింది.

ఇక సైన్యం గౌడ రాజధాని పౌండ్రవర్ధన నగరం సమీపించేసరికి దానిలో మిగిలిన సైనికులంతా కలిసి పదివేలమందికంటె ఎక్కువ లేరు. అయినా ఆ సైన్యంతో పౌండ్రవర్ధననగరం ముట్టడించితీరాలని జయాపీడు డాజ్ఞాపించాడు. కాని మహాసేనాధిపతి దేవశర్మ దీని కంగీకరించలేదు! సైన్యంలో చాలామంది రహస్యంగా స్వదేశానికి పారిపోతున్నారనీ మిగిలిన


స్థాపితము : 1920 సంll.
సమస్త చర్మవ్యాధులకు,
తెలుపు మచ్చలు వగైరా
లకు చికిత్సా నిపుణులు.
కట్లాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గొల్లప్రోలు తూర్పు గోదావరి జిల్లా
(వయా) పిఠాపురం.


సైనికులుకూడా స్వదేశానికి మరలిపోవడానికి తహతహపడుతున్నారనీ, ఈ విషమ ఘట్టంలో పౌండ్రవర్ధన నగరంపై దండెత్తిపోవడం ప్రమాద హేతువనీ విన్నవించాడు.

"మీరంతా ఇంతటి పిరికిపందలని తెలిసి ఉంటే నేనీ దిగ్విజయ యాత్ర సంకల్పించి ఉండక పోదును!" అన్నాడు జయాపీడుడు! దేవశర్మ జయాపీడునికి బాల్యమిత్రుడు. అందువల్లనే అతని శిరస్సింతవరకు సురక్షితంగా నిలబడి ఉన్నది! లేకపోతే ఈ పాటికది శూలాగ్రం మీద తాండవం చెయ్యవలసినదే!

"మనం స్వదేశం విడిచి చాలా దూరం వచ్చివేశాము! సైన్యానికి సంభారాలు సన్నగిల్లి పోయాయి! సైనికులంతా నిరుత్సాహులై ఉన్నారు! ఇక మిగిలి ఉన్న బలగం చాలా స్వల్పం! మనకెదిరి బలం ఎంత ఉన్నదో తెలియదు! ఇప్పుడు యుద్ధం బహు ప్రమాదకరం! ఆ పైన మరి దేవరవారి చిత్తం!" అన్నాడు దేవశర్మ.

"మీవంటి భీరువులతో కలిసి దండెత్తడం నాకే సిగ్గుచేటు! నేనొక్కడనే నా భుజబలంతో పౌండ్రవర్ధన నగరము జయించివేస్తాను! మీరంతా రాజధానికి తిరిగిపోవచ్చును!" అన్నాడు జయాపీడుడు! మహాసైన్యాధిపతి తెల్లబోయాడు! "వెంటనే దండెత్తిపోవలిసిందని సేనాధిపతుల కాజ్ఞ పంపిస్తున్నాను!" అన్నాడు దేవశర్మ తలవంచి.

"వల్లకాదు! నేనొక్కడనే జయించుకొని వస్తాను!" అని గర్జించాడు జయాపీడుడు! దేవశర్మ జయాపీడదేవునికి బాల్యస్నేహితుడే! కాని ప్రభువర్యుల దురంహంకారానికి అడ్డుపడడం ఆత్మశ్రేయస్కరం కాదనిగ్రహించి ఇక ఏమనడానికీ పాలుపోక తలవంచుకుని మాట్లాడ కూరుకున్నాడు.

మరునాటి రాత్రివేళ జయాపీడుడు హఠాత్తుగా తన గుడారంలో అదృశ్యుడైనాడు! పరిచారకులకు కూడా అతడేమైనది తెలియదు! కొన్ని అమూల్యరత్నహారాలు, కవచము, ఖడ్గము మాత్రమే కూడా తీసుకుపోయాడు! ఇక దేవశర్మ కేమీ పాలుపోక జయాపీడుని పునరాగమనం నిరీక్షిస్తూ ఆ పరిశిష్ట సైన్యంతోబాటక్కడే ఉండిపోయాడు. జయాపీడుడు మారువేషంతో పౌండ్రవర్ధన నగరంలో ప్రవేశించాడు. అప్పటినించీ ఆ నగరంలో విజయవర్మగా మారిపోయాడు. ఏమైనా సరే! పౌండ్రవర్ధన నగరం స్వాయత్తం కానిదే కాశ్మీర రాజ్యంలో తిరిగి అడుగుపెట్టకూడదని కార్తికేయ దేవాలయంలో దేవసేనాని కుమారస్వామి సన్నిధిని ఘోర శపథం పట్టాడు! ఆ ప్రతిజ్ఞ నెరవేరేవరకు తదితర భోగవినోదగోష్ఠీ ప్రసంగాలన్నీ పూర్తిగా విస్మరించి వెయ్యాలని కూడా నిశ్చయించుకొన్నాడు. అదే అప్పటివరకు అసిధారావ్రతంగా పరిపాలించాడు. ఆ విషయాలన్నీ ఆమూలాగ్రంగా ఆమెకు తెలియజేశాడు.

విషయాలన్నీ విన్న తరవాత వకుళమాలిక మరి తన కన్నులే నమ్మలేకపోయింది! తాను, కమల సందేహించినది నిజమే అయింది! వకుళమాలిక మొట్టమొదటిగా అతనిని చూచినపుడే అతడెవడో రాజబంధువో మరే మహాపురుషుడో అయి ఉండవచ్చునని ఊహించింది. అది ఊహించినదానికంటె ఎక్కువగానే నిజమయింది! "ఆహా ఎంతటి మహత్తరమైన సంఘటన! అని అదేపనిగా ఆశ్చర్యపోయింది వకుళమాలిక. ఇంతలో హఠాత్తుగా ఆమె కొక ఆలోచన తట్టింది. వెంటనే హడలిపోతూ ఇలా అడిగింది.

"ఒకవేళ మీ సంగతి మా జయంత మహారాజు చెవిని పడితే మరి మీకు ప్రాణాపాయం కాదా?"

"ఈపాటికీ వార్త ఆయనకు అందే ఉండవచ్చును" అన్నాడు జయాపీడుడు ముక్తసరిగా. అంతేగాని ఎక్కడా తొణకలేదు! 'ఎంత గుండె నిబ్బరం!' అనుకొన్నది వకుళమాలిక. వెంటనే ఇలాగంది:

"మీరిక ప్రచ్ఛన్నవేషం ధరించి తల దాచుకోక తప్పదు! లేకపోతే మీ ప్రాణాలకే ముప్పురాగలదు!"

"అవును లేకాని మరి గత్యంతరం!"

వకుళమాలిక తొందరగా ఏదో సలహా చెప్పిందే గాని తీరా ఎల్లాగ అతనిని దాచి వెయ్యాలో ఆమెకుస్ఫురించలేదు. చిట్టచివరి కేమీ పాలుపోక—"పోనీ మా భవంతి నేలమాళిగలో తలదాచుకుంటే!" అంది. జయాపీడుడు కొంత సేపాలోచించి—

"లేకపోతే నర్తకి వేషం ధరించి నీ ఎదుట నృత్యంచేస్తే"—అన్నాడు. వెంటనే విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు. వకుళమాలిక అతని ధోరణి చూచి నిర్ఘాంతపోయి— "మిమ్ము విరిగి మీదపడుతున్నా, ఏమిటీ నిర్లక్ష్యం!" అన్నది.

"పడితే పడనీ!"

"దయఉంచి, కొంచెం నా ప్రార్థన మన్నించరా!"

"ఇక ఇప్పు డింతకంటె చేయగలిగిందేమీ లేదు." అన్నాడు జయాపీడుడు.

ఇంతలో కమల వగర్చుకొంటూ అక్కడికి వచ్చి తొందర తొందరగా వకుళమాలిక చెవిలో ఏమేమో చెప్పి మెరుపులా తిరిగి వెళ్ళిపోయింది. జయాపీడుడు వకుళమాలిక కేసి చూసి భౌమముడి విరిచాడు. వకుళ

మాలికముఖం వెలవెలబోయింది. గజగజ వణికిపోతూ—

"రాజసైనికులు మా ప్రాసాదం చుట్టుముట్టారు. మహామాత్యులు లోపలికి వస్తున్నారు!...మీరిప్పటికైనా నేలమాళిగలో—" అని ఏదో చెప్పబోయింది.

జయాపీడుడు క్షణంలో పక్కనే వేలాడుతున్న ఖడ్గం చేతఁ బూని చరచరా భవంతి సింహద్వారంవైపు వెళ్ళబోయాడు! వకుళమాలిక కళ్ళమ్మట కన్నీటిధారలు ప్రవహించాయి. అతని రెండుచేతులు పట్టుకొని సాహసించవద్దని పరిపరి విధాలుగా బతిమాలింది. మొదట అతను కొంత నెమ్మదిగా ఆమెతో చెప్పిచూచాడు. ఆమె అతనికి దారి ఇచ్చేటట్లు కనబడలేదు. పైగా రెండుకాళ్ళు పట్టుకొని ప్రాధేయపడడం మొదలు పెట్టింది. ఒక్కసారిగా అతను ఆమెపట్టు విడిపించుకొని చరచరా సింహద్వారంవైపు వెళ్ళిపోయాడు. వకుళమాలిక దిగాలుపడి అక్కడే కూలబడిపోయింది.

## ౬

సింహాన్ని సంహరించిన వీరుని కవచం లోపల జయాపీడచక్రవర్తి నామధేయం కనపడిందని తెలియగానే పౌండ్రవర్ధన నగరం అంతటా దావాగ్ని దరికొన్నట్లయింది. కొంతకాలంనించీ జయాపీడ చక్రవర్తి తన అపార సైన్యాలతో దండెత్తనున్నాడని గ్రహించి గౌడరాజు జయంతదేవుడు ఆత్మరక్షణకోసం యుద్ధసన్నాహాలు చేస్తూనే ఉన్నాడు. అయితే గౌడరాజ్యం చాలా చిన్నది. కాశ్మీర చక్రవర్తి జయాపీడుని మహాసైన్య వాహినికీ, గౌడరాజు జయంతదేవుని స్వల్పసైన్యానికీ హస్తిమశకాంతరం. అయినా జయంతదేవుడు యథాశక్తిగా యుద్ధసన్నాహాలు చేయిస్తూనే ఉన్నాడు. అంతలో ఒక యోధుడు అతి రహస్యంగా వచ్చి జయంతదేవునికి ఆ మేలికవచంలోని నామాక్షరాలు చూపించాడు. దానితో జయాపీడుడు మారువేషంతో పౌండ్రవర్ధన నగరంలో ప్రవేశించిన విషయం స్పష్టపడిపోయింది. ఆ వార్త జయంతదేవునికి తెలియజేసిన యోధుని మూలంగా కూడా అది కర్ణాకర్ణిగా నగరం అంతటా పాక్కిపోయింది. దానితో పౌరులలోకూడా ఆ అలజడి బాగా వ్యాపించిపోయింది.

ఆ పరిస్థితులలో జయంతదేవుని క్షేమి పాలుపోలేదు. మహామాత్యునితో కలిసి రెండు మూడు గోష్ఠులలో విషయంలో మథనపడ్డాడు. జయాపీడుడు దేవదాసి వకుళమాలిక భవంతి వసతిగృహంలో ఉన్న విషయం గూఢచారులు పసిగట్టివేసి అది నెమ్మదిగా మహామాత్యుని చెవిలో వేశారు. జయంతదేవుడు వెంటనే జయాపీడుని బంధించివేస్తే తన దేశానికొచ్చే ఉపద్రవం తొలగిపోగలదని ఆలోచించాడు. జయాపీడుని సంహరించివేస్తే అతని సైన్యం ఆ విషయం తెలిసికొని కాశ్మీరదేశానికి పారిపోవచ్చును! అదే జయంతదేవుని ఎత్తు!

కాని వృద్ధ మంత్రి దానికంగీకరించలేదు. అంతమాత్రంచేత తమకు దండయాత్ర భయం తొలగదనీ కాశ్మీరసైన్యం ఆ తరవాతనే తమపై దండెత్తి నగరం యావత్తు భస్మీపటలం చేసివెయ్యవచ్చుననీ అతని భయం! ఈలోగా మరికొంతసైన్యం కాశ్మీర దేశాన్నించి గౌడ దేశానికి రావచ్చును. ఆ విధంగా తమకు కాశ్మీరానికీ క్రమక్రమంగా వైరాగ్ని ప్రజ్వరిల్లవచ్చును. ఈ బలవద్వైరంలో చిట్టచివరికి సర్వనాశనమైపోయేది గౌడరాజ్యమే! ఎటుచూచినా మహాప్రమాదమే ఎదుర్కొంటున్నది. అందుచేత జయాపీడుని చంపించివేసినా, బంధించివేసినా చివరికి జరిగే ఫలితం ఒక్కటే. కనక ఈ విషమఘట్టంలో జయాపీడునితో సంధి చేసుకొని అవిఘ్నంగా తమ రాజ్యం నిలబెట్టుకోవడం తప్ప వేరే ఉపాయమేమీ లేదని మంత్రి ఖచ్చితంగా నొక్కి చెప్పాడు.

జయంతదేవునికి కల్యాణదేవి అనే కుమార్తె తప్ప వేరే సంతానమేమీ లేదు! ఆమెను గౌడరాజ్యానికి సన్నిహిత రాజ్యాలు పరిపాలించే రాజన్యులకెవరికైనా ఇచ్చి వివాహంచేసి అవిఘ్నంగా తన రాజ్యం దృఢపరుచుకోవాలని జయంతదేవుని సంకల్పం. ఇరుగుపొరుగు రాజ్యాలలో శూరసేనుడనే మహారాజొకడున్నాడు. అతడు జయంతదేవునికి కొంచెం దూరబంధువు. శూరసేనునికి కల్యాణదేవినిచ్చి వివాహం చేస్తే ఆ దూరబంధుత్వం బాగా బలిసి దగ్గరపడవచ్చును. అదే జయంతదేవుని ఊహ. కాని ప్రస్తుతం కాశ్మీరసైన్య ప్రమాదం ఒక పెద్ద పెను ప్రళయంలా విరుచుకుపడింది. ఈ మహాప్రమాదం గడిచి బయటపడడమెలాగ? ముందుగా జయాపీడుని బంధించివేస్తే తరవాత శూరసేనుని సహాయంతో ఈ ప్రమాదం కొంతవరకు గడిచి గట్టెక్కవచ్చును. జయంతదేవుని ఆలోచనలీవిధంగా సాగిపోయాయి. కాని ఆ మహామాత్యుని కీపంథా నచ్చలేదు.

"మహాప్రభూ! మీరు చెప్పినది ప్రస్తుత ప్రమాదానికే విధంగానూ సహాయకారి కాదు." అన్నాడు.

జయంతదేవునికి ఏమి చెయ్యడానికీ పాలుపోక ఏదోవిధంగా సంధి చేసి తమ ప్రతిష్ఠ నిలబెట్టేమార్గం ఆలోచించవలసిందని అన్నాడు.

అమాత్యుడు అతని వైఖరికి సంతోషించి "బలవంతులతో సంధి జరుగుతూన్నప్పుడు మనం స్వల్ప విషయాలలో సంకోచిస్తూ వెనకంజ వెయ్యడం కూడనిపని" అన్నాడు.

జయంతదేవు డతని మాటలలో లోపలి అంతరార్థం గ్రహించుకొన్నాడు. కాని స్పష్టంగా ఏదీ తేల్చి చెప్పక మంత్రి ముఖం కేసి చూసి నెమ్మదిగా ఇలా గన్నాడు.

"ఏ విధంగా సంధి జరిగినా నా కభ్యంతరం లేదు! కాని మన రాజ్యప్రతిష్ఠకు వంశప్రతిష్ఠకు మాత్రం భంగం కలగకూడదు! ఆ అప్రతిష్ఠ కన్న వీర మరణమే మేలు!" అన్నాడు.

"ఎంత మాట! నేనుమాత్రం దాని కంగీకరిస్తానా! యుద్ధానికి సిద్ధంగా ఉండవలసిందని సేనాధిపతులందరికీ ఆజ్ఞ ఇచ్చి ఇక్కడికి వచ్చాను! సేనా విషయంలో ముట్టమొదటే మేలుకొన్నాను" అన్నాడు మహామాత్యుడు.

మంత్రి కార్యజ్ఞతకు జయంతదేవుడెంతో ఆనందించాడు.


"వ్యవహారం చెయ్యి దాటిపోతే జయాపీడుని నిలుచున్నపాటుగా బంధించివేసి సూర్యాస్తమయానికి పూర్వమే తమ సన్నిధిని నిలబెట్టగలను!" అన్నాడు మంత్రి.

"అదే సరియైన మార్గమేమో!" అన్నాడు జయంతదేవుడు.

"నేను జయాపీడ చక్రవర్తి ధోరణిబట్టి ఈ సాయంకాలానికే ఏదో ఒకటి తేల్చివేస్తాను. ఇంతకు వ్యవహారమేమీ చెయ్యి దాటిపోలేదు!" అన్నాడు మంత్రి.


పిమ్మట అతడొక నాయకుని అశ్వికయోధులను వెంటబెట్టుకొని వకుళమాలిక భవంతి ముట్టుముట్టి తన రాక వకుళమాలికకు తెలియజేశాడు. కమల ఆ విషయమే అతి రహస్యంగా వకుళమాలిక చెవిలో ఊది వెళ్ళిపోయింది. ఆమె మంత్రికి రాజోచితమర్యాదలు జరిపించవలసిందని చెప్పి వంటనే కమలను పంపించి వేసింది. అంతలోనే జయాపీడు డాకలిగొన్న పులిలా అక్కడికి జయులు చేరి వెళ్ళిపోయాడు. కమల మంత్రికి సముచిత మర్యాద జరిపి, జయాపీడునికి ముత


16 జ్యూయల్సు చేతిగడియారం రు. 5.



స్విస్ తయారీ. 16 జ్యూయల్సు వాస్తవికమైన చేతి గడియారం. 16 ఏళ్ళ గ్యారంటీ. ధర రు. 5. పోస్టేజీ రు. 1/8- అదనం. Swiss Watch Suppliers P. B. 1392, (A, P. M.) Delhi

కావాల్సి తమ అడ్రెస్ ఇంగ్లీషులో వ్రాయాః



చిదంబరంలో కనకసభ. ఇక్కడిదైవం నటరాజు. ఈ ఆలయగోపురం మధ్యాహ్న సూర్యకాంతిలో బంగారువన్నె లీనుతుంది.

—ఫొటో: ఎస్. రామకృష్ణ.

## ★ దేవదాసి ★

త్రికీ కొంచెం పరిచయం కలిగించి ఏదో మిషమీద నెమ్మదిగా అక్కడినించి వెళ్ళిపోయింది. ఇక అక్కడ జయాపీడుడు, జయంతదేవుని మంత్రి మాత్రమే మిగిలారు.

మొదట మంత్రి తన ప్రసంగం కొంత సౌమ్యధోరణిలో సాగిపోనిచ్చాడు. జయాపీడ చక్రవర్తి కొంచెంసేపా ప్రసంగం విన్నాడు. తరవాత కొంచం బింకంగా ఇలాగన్నాడు:

"నేనిప్పుడు కేవలం ఏకాకిని! మీరు సైన్యంతో వచ్చారు. అది నేనెరుగుదును! నన్నిప్పుడు నిర్బంధించివేసినా నేనిక చెయ్యగలిగినది ఏమీ లేదు!"

"మేము దురుద్దేశ్యంతో ఇక్కడికి రాలేదే!"

"అదే యథార్థమయితే ఆ అశ్విక సైన్యం పటాటోప మేల?"

మంత్రికి మరి మాట పెగల్లేదు! ఒక్క నిమిషం మాట్లాడ కూరుకుని—"ఈ అశ్వికులు కేవలం గౌరవార్థమే నావెంటవచ్చారు! వీరిని వెంటనే తిప్పి పంపించివేస్తున్నాను!" అన్నాడు. వెంటనే లేచి నిలబడి అశ్వికులందరికీ తిరిగి వెళ్ళిపోవలసిందని ఆజ్ఞ చేశాడు. క్షణంలో ఆ అశ్వికులంతా తిరిగి వెళ్ళిపోతూంటే వారి అశ్వాల పాదఘట్టన ధ్వనులు రాజవీధిలో మారుమోగాయి. తానా అశ్వికబలం వెంటబెట్టుకు రావడంవల్ల తన యత్న సాఫల్యానికి కొంత ప్రాతికూల్యం ఏర్పడినదని మంత్రి లోలోపల కొంచెం కించపడ్డాడు. కాని జయాపీడుని కింకా మంత్రి సద్భావం విషయంలో సందేహం తీరలేదు. అతని లోతులు తెలియనిదే యీ సంధి కంగీకరించడం కేవలం అత్మవినాశ హేతువుగా పరిణమించవచ్చునని జయాపీడుని అనుమానం. అందుచేత మంత్రి ననేక విధాలుగా పరీక్ష చేశాడు. ఆ వృద్ధ మంత్రి కార్యసానుకూలతకోసం అతి వినయంగా అతనికి సముచితమైన ప్రత్యుత్తరాలిచ్చాడు. జయాపీడుని ప్రశ్న పరంపర కొంచెం తీవ్రధోరణిలో సాగిపోయింది.

"అయితే—త్రికరణశుద్ధిగా మీరీ సంధి కంగీకరిస్తున్నారా?"

"ఎంతమాట! ఈ ప్రయత్నం అంతా దానికోసమేగదా!"

"అయితే మా సైన్యాలు వెంటనే పౌండ్రవర్ధనంలో ప్రవేశించడానికి మీకేమైనా అభ్యంతరం ఉన్నదా?"

"ఏమీ లేదు! వెంటనే ప్రవేశించవచ్చును. అయితే మీరు మమ్మల్ని కేవలం సామంత రాజులుగామాత్రం పరిగణించకూడదు! వారు మాత్రంగా మీకు కొంత కప్పం చెల్లించడానికి మాకేమీ అభ్యంతరం లేదు!"

జయాపీడునికి సమాధానంతో కొంత సంతృప్తి కలిగింది. అయినా అతని అనుమానం తీరలేదు! కొంచెంసే పాలోచించి మళ్లీ మంత్రిపరీక్ష ప్రారంభించాడు:

"జయంతదేవునికి సంతానం ఒక్క కుమార్తే కదా!"

"అవును!"

"ఆమె నామధేయం?"

"కల్యాణదేవి!"

"జయంతదేవులు కాశ్మీర చక్రవర్తితో సంబంధ బాంధవ్యాల కంగీకరిస్తారా?"

వృద్ధమంత్రి ఈ ప్రశ్నతో నిర్ఘాంతపోయాడు! కాని వెంటనే తమాయించుకున్నాడు: "ఎంత మాట సెలవిచ్చారు! వారిది మహాభాగ్యంగా పరిగణించగలరు! అయితే నేనీ విషయం మా ప్రభువులతో ముందుగా సంప్రదించలేను!"

"దానికేమి! తరవాత సంప్రదించవచ్చును. కాని సంధికీ, పరస్పర సౌహార్ద బాంధవ్యాలకు ఈ వివాహం అత్యంతావశ్యకం!" అన్నాడు జయాపీడ చక్రవర్తి.

ఆ పైన వృద్ధ మంత్రి కొంత లోతుగా ఆలోచించాడు. అలాగే జయాపీడుని ముఖవైఖరి పరిశీలిస్తూ నెమ్మదిగా ఇలాగన్నాడు.

"కాబంట్కే [illegible] గదా !

"అవును!"

"అయితే మా కళ్యాణదేవి కాశ్మీర పట్టమహిషి కాబోతున్నదన్న మాట! ఎంతటి అదృష్టవంతురాలు!"

"పట్టమహిషీ గౌరవ విషయం మాత్రం నే నంగీకరించలేను.

"ధర్మ ప్రకారం ఆ గౌరవం ఆమెకే చెందవలెను గదా !"

దీనిమీద జయాపీడుడేమీ అనలేదు! అలాగే మౌనం అవలంబించాడు. వృద్ధ మంత్రి ఇక ఈవిషయంలో అంతగా నొక్కి నొక్కి ప్రశ్నించడం భావ్యం కాదనుకొని మళ్ళీ ఆ విషయం ప్రసంగించడానికి సాహసించలేదు. జయంతదేవునికి స్వీయవంశ మర్యాద లత్యంత ముఖ్యమైనవని అతనికి తెలుసును. అందుచేత ఇది చివరికి సంధి ప్రయత్నాలకే విఘాతంగా పరిణమించ గలదేమోనని అతనికి భయంవేసింది. కాని ఏదో విధంగా ఇది సాధించలేకపోతామా అనే ధైర్యంతో అప్పటికా ప్రయత్నం విరమించివేశాడు. అదీగాక జయంత దేవునితోకూడా కొంత సంప్రతించవలసిన అవసరంకూడా ఏర్పడింది. ఇవ్వన్ని ఆలోచించుకొని వృద్ధమంత్రి సవినయంగా జయాపీడుని దగ్గర సెలవుతీసుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

జయాపీడుడేదో తీవ్రంగా ఆలోచిస్తూ నెమ్మదిగా తన వసతి గృహంలోకి వెళ్ళిపోయాడు. ఆ గృహద్వారంలోనే అతనికి వకుళమాలిక ఎదురైంది. అతడు లోపలికి వెళ్ళి విశ్రమించాడు. వకుళమాలిక ఎంతో ఆత్రంగా అతనివైపు చూచింది. జయాపీడుడు మంత్రికీ తనకు మధ్యజరిగిన వ్యవహారమంతా ఆమూలాగ్రంగా ఆమెకు తెలియజేశాడు.

ఆమె ఇంతకుపూర్వం ఏ క్షణంలోనైనా ఆ ఆశ్విక యోధులు జయాపీడుని బంధించి వెయ్యవచ్చునని భయపడింది. కాని, ఇప్పుడీ కళ్యాణదేవి వివాహ ప్రస్తావన—ఈ సంధి వ్యవహారము వినేసరికి ఒక్కసారిగా ఆమె మనస్సులో అనేక భావా లుదయించాయి. మొట్టమొదట "కళ్యాణదేవి ఎంతటి అదృష్టవంతురాలో!" అని లోలోపల ఎంతో అసూయపడింది. కాని జయాపీడు డామెను పట్టమహిషిపదవి కంగీకరించక పోవడానికి కారణమేమో ఆమెకు బోధపడలేదు! జయాపీడుని మనఃఫలకంపై మరిఒక భాగ్యశాలిని ఎవరైనా ఉన్నదేమో!

అతడామెకే ఆ గౌరవపదవి సమర్పించ వలెనని నిశ్చయించుకొన్నాడేమో! అందువల్లనే కళ్యాణదేవిని పట్టమహిగా అంగీకరించలేదేమో! ఆహా! పురుషుల చిత్తప్రవృత్తు లెంత విచిత్రమైనవి! జయాపీడుని హృదయం చూరగొన్న ఆ సుందరీమణి ఎవరో! ఆమె ఎంతటి అదృష్టవంతురాలో! ఈ విధంగా వకుళమాలిక భావనాపరంపర సాగిపోయింది.

అయితే ఆ అజ్ఞాత సుందరీమణి మూలంగా ప్రస్తుత సంధి రాయబారాలు భగ్నమైపోవచ్చునని, అప్పుడు గౌడ రాజ్యానికే గాక జయాపీడుని ప్రాణానికికూడా అపాయం సంభవించవచ్చునని ఆమె భయపడింది. అందువల్ల కేవలం తాత్కాలిక క్షేమదృష్ట్యా కళ్యాణదేవి వివాహాని కంగీకరించవలసిందని అతన్ని ప్రార్థించడమే అవశ్య కర్తవ్యమనికూడా ఆమె నిశ్చయించింది. వకుళమాలిక అలాగే కనురెప్ప వెయ్యకుండా అతనివైఖరి పరిశీలించి, ఎంతో ఆప్యాయంగా కళ్యాణదేవి వివాహ విషయంలో బతిమాలుకొన్నది:

"కళ్యాణదేవి నీయవలసినదని కోరినవారు మీరేగదా!"

"కావచ్చును! దానికేమి?" అన్నాడు జయాపీడుడు.

"అయితే ఆమెను పట్టమహిషిగా అంగీకరించకపోవడం కేవలం అన్యాయం!"

"నీ వన్నది నిజమే! కాని ఇంతకు పూర్వమే ఆ గౌరవం మరొకరికి అంకితమైపోయింది!"

"ఈ సమాధానం వకుళమాలిక హృదయానికొక శూలంలా నాటింది. కొంతసేపటివరకు ఏమీ అనలేక తలవంచి కనురెప్పలు వాల్చి మెల్లిగా ఇలా గడిగింది."

"అంతటి అదృష్టవంతురా లెవరో కొంచెం నేను వినవచ్చునా?"

"ఆఁ వినవచ్చును! దీనిలో అంత రహస్యమేమీలేదు!" ఈ సమాధానంతో వకుళమాలిక కొంచెం నిర్ఘాంతపోయింది!

"అయితే ఆమె పేరు?"

"వకుళమాలిక!"

"నేనా?"

"నీవే!

వకుళమాలిక ఈ మాట నమ్మలేదు!

"[illegible] పరిహాసాలకు [illegible] అన్నారు! అదే పదివేలు!"

"పరిహాసం కాదు! నామాట నిశ్చయమే."

అని జయాపీడు డామెను కౌగలించుకో బోయాడు.

ఆమె అతనికి కొంతదూరంగా తొలగి పోయి, ముసుగు మీద వేసుకొని కొంచెం పోకళగా నవ్వింది.

"ఇంకా మీ ప్రతిజ్ఞ నెరవేరలేదు. మరిచి పోయారా?" అన్నది.

"మరిచిపోలేదు!—కాని ప్రతిజ్ఞ నెరవేరి నట్లే!"

అని జయాపీడుడు మళ్ళీ ఆమెను కౌగలించుకోబోయాడు.

"రాజకుమార్తెను పట్టమహిషిగా అంగీకరించినప్పుడుగా అది నెరవేరేది!" అంతవరకు నే నప్పుకోను!"

అని వకుళమాలిక అతనికి దొరకకుండా తప్పించుకొని అక్కడినించి వెళ్ళిపోయింది. ఆ ఆఖరి మాట జయాపీడుని హృదయంలో నాటుకు పోయింది.

ఆమె వెంటనే తన శయ్యాగృహంలో ప్రవేశించి, కమలతో ఆ నాటి వృత్తాంతం అంతా మొదటినించీ పూసగుచ్చినట్లు చెప్పివేసింది. —సశేషం.


కలవరపడు స్త్రీలకు!

"కుమారి" (మాత్రలు) వాడండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతఅనవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజి ప్యాకింగ్ ప్రత్యేకం
Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.
స్టాకిస్టు: Indo Medical supplies
No. 3, Pauliappan st, Seven wells Madras-1.


10,000 వాటర్ ప్రూఫ్, 17 జ్యూయల్సు వాచీలు ఉచితంగా పంచిపెట్టబడును. ఉచిత సిటోకేటర్కు, కార్డు వ్రాయండి.
SWISSCO (INDIA), P. B. 10030, Bombay-1.

రు. 5 లకు రేడియో

ఈ రేడియో విద్యుచ్ఛక్తి, బాటరీ, లేకుండా పనిచేస్తుంది. స్టాకు పరిమితం వెంటనే వ్రాయండి. రు. 5. పోస్టేజి అదనం.
American Radio House, Shaktinagar Delhi-6.
[illegible] వ్రాయండి

# దేవదాసి

## ప్రాచీన గాథాలహరి

**పి. గణపతిశాస్త్రి**

(గతసంచిక తరవాయి)

### 8

మహామాత్యుడు వెంటనే జయంతదేవుని భవనానికి వెళ్ళి తనకు జయాపీడునికీ మధ్య జరిగిన సంధి రాయబార వ్యవహారా లన్నీ సవిస్తరంగా నివేదించాడు. జయంతదేవుడు ఆ వృత్తాంతం అంతా విని చాలా సంతోషించాడు. జయాపీడదేవుని సైన్యాలు వెంటనే పౌండ్రవర్ధననగరంలో ప్రవేశించడానికీ కాశ్మీర చక్రవర్తికి నామమాత్రంగా కప్పం కట్టడానికీ అంగీకరించాడు. కల్యాణదేవిని జయాపీడునికిచ్చి వివాహం చెయ్యడానికి కూడా అభ్యంతరమేమీ చెప్పలేదు. కాని ఆమెకు పట్టమహిషీగౌరవం లేకపోవడం అతనికి సుతరామూ నచ్చలేదు. ఇన్ని విధాలుగా తాము సామరస్య మార్గం అవలంబించి సంధికి ఒడంబడితే జయాపీడ చక్రవర్తి ఆమె పట్టమహిషీగౌరవాని కంగీకరించకపోవడం అతనికి ఎంతో అవమానకరంగా తోచింది. అందుచేత ఏమైనా ఈ విషయానికిమాత్రం తా నెంతమాత్రము అంగీకరించేది లేదని ఖచ్చితంగా చెప్పివేశాడు. వృద్ధమంత్రి ఈ చిన్న విషయాని కింతగా పట్టుపట్టడంవల్ల సంధి వ్యవహారం పూర్తిగా చెడిపోవచ్చునని జయంతదేవునికి విస్పష్టంగా చెప్పివేశాడు.

అయినా అతడా విషయాని కంగీకరించలేదు. వృద్ధమంత్రి తిరిగీ జయాపీడుని సన్నిధికి వచ్చి అతనితో ఆ విషయం ప్రస్తావించాడు. జయాపీడు డామెను వివాహమాడడానికే అంగీకరిస్తున్నాననీ ఇక పట్టమహిషీ గౌరవవ్యవహారం తనతో ప్రస్తావించవద్దనీ నిష్కర్షగా చెప్పివేశాడు. చక్రవర్తి కది మొట్టమొదటి వివాహమనీ అందువల్ల ఆ గౌరవం కల్యాణదేవికే చెందడం ధర్మసమ్మతమనీ అలాగ కాని పక్షంలో అది అనూచానమైన ధర్మసంప్రదాయానికే వ్యతిరేకమనీ మంత్రి తిరిగీ అనేక విధాలుగా జయాపీడ చక్రవర్తికి విన్నవించాడు. కాని ఏమీ ప్రయోజనం కలగలేదు! మంత్రికి వ్యవహారం అంతా మొదటికి వచ్చిందనీ ఇక యుద్ధం తప్ప వేరే గత్యంతరమేమీ లేదనీ భయం వేసింది. అయినా పైపై కేమీ తొణకకుండా జయాపీడునిదగ్గర సెలవు తీసుకుని తన భవనానికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రాత్రి అంతా ఈ వ్యవహారంలో తల బద్దలు కొట్టుకోగా తెల్లవారుఝామున అతని కొక ఆలోచన స్ఫురించింది.

ఆ మరునాడు వెంటనే ఒక కర్ణీరథంలో ఒక పరిచారికను వకుళమాలికభవంతికి పంపించి, అతి రహస్యంగా ఆమెను తన ప్రాసాదానికి తోడ్కొనిరావలసిందని చెప్పి అలాగే ఆమె రాకకోసం నిరీక్షిస్తూ నిలుచున్నాడు.

పౌండ్రవర్ధన నగరం కార్తికమాస సూర్యోదయ కాంతులలో అప్పుడప్పుడే మేలుకొంటున్నది. మంత్రిభవంతి చుట్టూ కలకలలాడే ఉద్యానవనంలో రంగురంగుల సీతాకోకచిలకలు ప్రాతఃకాల స్వర్ణకాంతులలో ఎగురుతూ చిత్రవిచిత్రంగా మెరిసిపోతున్నాయి. ఆ ఉద్యానవనం అంతా సూర్యోదయ కాంతి ప్రవాహంలో తల మునకలై ఓలలాడుతున్నట్లు స్ఫురించింది.

కొంతసేపటికి వకుళమాలిక కర్ణీరథం దిగి మెల్లగా మంత్రి గృహంలో ప్రవేశించింది. మంత్రి ఆమె లోపలికి రాగానే ఎంతో ఆప్యాయంగా గౌరవించాడు. ఆ అపూర్వ గౌరవం ఆమెకెంతో అపురూపంగా కనిపించింది. ఇక అక్కడ వృద్ధమంత్రి వకుళమాలిక తప్ప ఎవరులేరు. అతడు లోలోపల ఏదో ఆలోచిస్తూ క్షణకాలం ఆమె ముఖవైఖరి పరిశీలించాడు. ఈ వేళ ఆమె సౌందర్యం ద్విగుణీకృతమైపోయినట్లు మెరిసిపోతున్నది.

మంత్రి, చెప్పవలసినంతవరకు ఆమెకు జయాపీడుని వృత్తాంతం తెలియజేశాడు. అదంతా చాలావరకామెకు తెలిసిందే. ఆమె తనకు తెలిసిన వృత్తాంతంకూడా కొంతవరకు అతనికి తెలియజేసింది. అంతేగాని తన అనురాగవృత్తాంతమేమీ అతనికి తెలియనీయకుండా గుంభనగా దాచివేసింది. జయాపీడుని వైణిక విద్వత్తు విని వీణావాద్యంలో విశేషాలు గ్రహించడానికే తన భవంతికి ఆహ్వానించాననీ — మొట్టమొదట అతడు కాశ్మీర చక్రవర్తి అన్న రహస్యం తనకేమీ తెలియదనీ అన్నది.

వృద్ధమంత్రి ఈ కథ అంతగా నమ్మలేదు. కాని అది పూర్తిగా నమ్మినట్లే నటించాడు. జయాపీడుడు కల్యాణదేవిని పట్టమహిషిగా స్వీకరించక పోవడానికి కారణం కనుక్కోవాలనీ, ఆ విషయంలో ఆమె సహాయపడగలదనీ ఆశించాడు. కాని ప్రయోజనమేమీ కలగలేదు!

"ఏమైనా ఈ వ్యవహారంలో నీ చాకచక్యము, సాహాయ్యము చాలా అవసరం!" అన్నాడు మంత్రి నిశ్చలంగా ఆమెకేసి చూసి.

"నేను కేవలం అబలను. నేనేమి చెయ్యగలను!"

"గౌడరాజ్యం అంతా చాలా విషమసంధిలో పడిపోయింది! ఈ సమయంలో మమ్మల్ని ఉద్ధరించగలిగిన దానవిక నీవొక్కతెవే!"

"మన మహారాజు విషయంలో అంత పట్టు పట్టవలసిన అవసరమేమి కలిగింది? జయాపీడులు కల్యాణదేవిని వివాహమాడడానికి అంగీకరించారు కదా!"

"అది నిజమే! కాని పట్టమహిషిగా

అంగీకరించడం లేదు! అది మన రాజవంశానికెంతటి అగౌరవం! ఇలాంటి విడ్డూరమెన్నడైనా ఎక్కడైనా జరిగిందా?"

"నిజమే! మరి జయాపీడు లామెను పట్టమహిషిగా అంగీకరించేది లేదని భీష్మించుకొని కూర్చున్నప్పుడు ఇక గత్యంతరమేమిటి?"

"గత్యంతరం లేకేమి?—నీ వొకసారి ఆయనతో నొక్కి చెప్పాలి."

"నేనా?"

"అవును నీవే!"

"నా కాయనదగ్గర అంతటి చనువు లేక!"

మంత్రి ఆమె తనతో అన్ని విషయాలు మనసు విడిచి ప్రసంగించడం లేదనీ కాని ఆమెకు జయాపీడునితో కొంత సన్నిహిత పరిచయం ఏర్పడి ఉండవచ్చుననీ గ్రహించివేశాడు. అంతేగాని అంతకంటె లోతుగా అతని ఆలోచన పోలేదు. అయినా అది పైకి తేలకుండా నెమ్మదిగా ఇలాగన్నాడు:

"వకుళా! ఇటు మాడు! నావంటి వృద్ధుల నే నీ సౌందర్యం ఉక్కిరి బిక్కిరి చేస్తోందే! ఇక తరుణుల మాట వేరే చెప్పాలా!"

ఈ ధోరణితో వకుళమాలిక చెక్కిళ్లెర్రబడ్డాయి. ఆమె వెంటనే తలవంచుకొన్నది!

"ఇవి కేవలం నామీద అప్యాయంకొద్దీ అన్నమాటలు! ఇంతకీ మీరి మాట లెందుకన్నారో నాకు తెలియకపోలేదులెండి! ఏమైనా వారంతటి సులభులు మాత్రం కారు!"

"పోనీ నీవు యథాశక్తిగా ప్రయత్నిస్తానని మాట ఇస్తే - నాకదే పదివేలు!"

"ఎంతమాట! తప్పక ప్రయత్నిస్తాను! కాని నా కంతగా ఆశ లేదు!"

"నా కింకా ఆశపోలేదే! పౌండ్రవర్ధన పౌరుల యోగక్షేమాల కిక నీవే దిక్కు! మరి ఈ ప్రయత్నం నెరవేరలేదనే మాట వినబడగూడదు! తెలిసిందా?"

"సరే! తమ రిన్నిసారులు చెప్పాలా? ప్రయత్నించి చూస్తానన్నాను గదా!"

"తరతరాలనించీ పౌండ్రవర్ధన మహారాజులు మీకు దేవమాన్యాలిచ్చి గౌరవించారు! కార్తికేయస్వామి గౌడ రాజవంశీయుల కులదైవం! ఇవన్నీ ఒకసారి బాగా జ్ఞప్తికి తెచ్చుకోవాలీ వేళ!"

"నేనంతటికి కృతఘ్నురాలను కాను! కాని వారు నా మాట గౌరవించవలెను గదా!"

అని చెప్పి వకుళమాలిక తిరిగి వెళ్లిపోతూ అతని దగ్గర సెలవు తీసుకుని పది అడుగులు ముందుకు సాగింది.

అంతలో వృద్ధమంత్రికి మళ్ళీ ఏదో స్ఫురించింది. వెంటనే ఆమెను తిరిగీ ఇంకొకసారి లోపలికి పిలిచాడు. ఆమె ఎంతో ఆశ్చర్యపడింది. మళ్లీ అతని కెదురుగా వచ్చి నిలబడింది.

"వకుళా! ఈ వ్యవహారంలో నీవు కొంచెం స్వార్థం విడిచి వ్యవహరించాలి!" అన్నాడామె మాటలలో లోతులు గ్రహించి. వకుళమాలిక కొకసారిగా చెక్కిళ్ళలో కుంకుమధూళి చెలరేగింది. అయినా ఆమె అతి గుంభనగా ఆభావం పైకి కనబడనీయక అతని ప్రశ్నకు కేవలం ధోరణిగానే ఇలాగ సమాధానం ఇచ్చింది.

"మాకు కావలసినది పరార్థమేగాని స్వార్థం కానేకాదే! అన్నీ తెలిసిన మీరే ఇలాగంటే ఇక నేనేమి చెప్పను!"

అని ఆమె కొంటెగా ఒక నవ్వు నవ్వింది.

మంత్రి ఈ ధోరణి అంతరార్థం గ్రహించుకొని ఉదాత్తంగా ఒక నవ్వు నవ్వి-

"ఇంతటి ఔదార్యవంతురాలవు గనక, నేనింతగా నిన్ను విషయం అర్థిస్తున్నాను!" అన్నాడు.

మహామాత్యుడంతటి వ్యక్తి ఆవిధంగా అర్థించేసరికి ఆమె కొంచెం మెత్తబడి—

"మీ రంతటిమాట అనకూడదు! నా యావచ్ఛక్తి వినియోగించి తప్పక ప్రయత్నిస్తాను." అన్నది.

మంత్రి ఆమె ముఖవైఖరి గమనించి లోలోపల చాలా సంతోషించాడు. తిరిగీ ఆమె అతని దగ్గర సెలవు తీసుకొని తన భవనానికి మరలిపోయింది.

౮

వకుళమాలిక తన భవంతికి వచ్చివేసిన తరవాత చాలా సేపటివరకు ఏదో పరధ్యానంగా ఉన్నట్లే కనబడింది. మధ్యాహ్నం కొంచెంసేపు విశ్రమించిన తరవాత కమలను తన శయ్యాగృహంలోనికి పిలిచి మహామాత్యునికీ తనకు మధ్యన నడిచిన వ్యవహారం అంతా పూసగుచ్చినట్టు చెప్పివేసింది. కమల ఈ వ్యవహారం అంతా విని కొంతసేపటిదాకా అలాగే ఆశ్చర్యపోయింది. తరవాత వకుళమాలికతో గట్టిగా ఇలాగన్నది: "ఏది ఏమైనా సరే! నీవే పట్టపురాణివి కావాలి! నీవు కూడా నేనే పట్టపురాణిని కావాలని భీష్మించుకుని కూర్చో! వ్యవహారం అంతా దానంతట అదే సర్దుకుపోతుంది!"

"ఏమీ సర్దుకుపోదు! చివరి కిదంతా చిలికి చిలికి గాలివానగా మారుతుంది. అంతే!"

"ఏమీ భయం లేదు! నామాట నమ్ము! జయాపీడచక్రవర్తి గట్టిగా పట్టుపట్టితే మన మహారాజా లొంగిపోక తప్పదు!"

"ఆయన అలాగ లొంగిపోయేటట్టు కనబడడం లేదే! చివరి కిదంతా యుద్ధందాకా వచ్చి మన ప్రాణాలకు కూడా మోసం వచ్చేటట్లుందే!"

"పోనీ! అంతవరకు వస్తే అప్పటిమాట చూసుకుందాంలే! ప్రస్తుతానికి నీ పట్టు మాత్రం విడిచిపెట్టకు!"

"నేనేమీ పట్టు పట్టడమే లేదు! కళ్యాణదేవి విషయంలో నా శాయశక్తులా ప్రయత్నం చేస్తానని మహామాత్యులకు మాట ఇచ్చి వచ్చేశాను."

"మంచిపనే చేశావులే! గాని ఇక ఈ పైన ఏమీ ఎరగనట్టు మాట్లాడకూడదు! మళ్ళీ మహామాత్యులుగాని పిలిపిస్తే జయాపీడ చక్రవర్తి నామాట ఏమీ చెవిన పెట్టలేదని చెప్పు! తెలిసిందా?"

"కాని కమలా! ఇంతా చేస్తే దీనివల్ల కలిగే ప్రయోజనం?"

"సరిపోయింది! మళ్లీ మొదటికి వచ్చావా! నీవు కాశ్మీరచక్రవర్తికి పట్టపురాణి వవుతావు!"

వకుళమాలిక కొంచెంసే పాలోచించింది.


"సరేగాని—ఎందుచేతనో నాకీ పట్టమహిషీపదవి అంటే లోలోపల కొంచెం భయంగానే ఉందే కమలా!"

కమల నిర్ఘాంతపోయి వకుళమాలికతో ఇలాగన్నది.

"అయ్యో! వెర్రిదానా! ప్రభువులు బహువల్లభులు! ఈ వేళ ఏర్పడిన ఆప్యాయత, అనురాగము రేపుండవు! నే నెన్నిమారులు చెప్పినా నామాటలక్ష్య పెట్టకుండా ఉన్నావు. తరవాత చేతులుకాలితే మరి పశ్చాత్తాపపడినా ప్రయోజన మేమీ ఉండదు! జాగ్రత్తగా ఆలోచించుకో!"


సుగంధికా
సరస్వతీ తైలము

మెదడుకు, చల్లదనముకు, కన్ను, ముక్కు, చెవి, వ్యాధులకు, 32 సం॥ నుండి ప్రపంచమంతటా వాడుచున్నారు. ఒకసారి వాడిన తెలియును
మీ పెద్దడీలర్ల అందరి వద్ద దొరుకును.
ఈష్టర్న్ మెడికల్ వర్క్సు,
కాకినాడ.
డిస్ట్రిబ్యూటర్లు: సీతారామ్ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్,) విజయవాడ -1.




బుద్ధ జయంతికి ప్రత్యేక తపాలా బిళ్ళ. ఈ చిత్రాన్ని శ్రీ ఆర్. డిసిల్వా (థానాజిల్లా) రచించారు. పోటీకి వచ్చిన 250 చిత్రాల్లో రెండింటిని ప్రభుత్వం స్వీకరించింది. ఇందులో బోధివృక్షం, ఛత్రం లోపలి భాగం, రావిరెమ్మ ఉన్నాయి.

# ★ దేవదాసి ★

ఆపైన నీయిష్టం!" అని కమల అక్కడినించి వెళ్ళిపోయింది!

వకుళమాలిక కొంచెంసేపు తటపటాయించి, ఒక్క నిట్టూర్పు విడిచి ఇలాగంది:

"కమలా! అంతటి అనురాగమే అదృశ్యమైపోతే ఇక ఈ భోగభాగ్యాలు, పట్టుపీతాంబరాలు నన్ను రక్షిస్తాయా! పోనీలే!"

"సరే! నీ ఇష్టం! విధివిధానం ఎవరు తప్పించగలరు! కాగా ఆలోచించుకో!"

"సరే! నేనేమీ తొందరపడి తప్పటడుగు వెయ్యనులే!"

తరవాత కమల [illegible] మౌనంగా అక్కడినించి వెళ్ళిపోయింది.

వకుళమాలిక అక్కడే కూర్చుండిపోయి అనేకవిధాలుగా ఆ విషయాన్ని గురించి మథనపడింది. ఆమెకు కమల చెప్పినదే సరియైన మార్గమేమో అనిపించింది. కాని దానిమూలంగా జయాపీడ జయంతదేవుల మధ్య యుద్ధమే సంభవిస్తే చిట్టచివరికి దాని పర్యవసానం ఏమౌతుందో! జయాపీడుడా యుద్ధంలో ఓడిపోతే! ఈ విషమైన ఆలోచనలు ఎటూ తేలక చివరికి అలసిపోయి ఆమె అక్కడే కొంచెంసేపు కన్నుమూసింది. ఆ [illegible] మైన కల ఆమె కళ్ళలో హరివిల్లులా మెరిసినట్లయింది! వెంటనే చిరునవ్వుతో కళ్ళు తెరిచింది. ఆ కల ఆమెకళ్ళల్లో అలాగే మెరిసింది.

లేచి ఎదురుగా సువర్ణదర్పణంలో అలంకారాలు, ముంగురులు చక్కగా సరిదిద్దుకొని మెల్లిగా జయాపీడుని పడకగృహంలోనికి వెళ్ళిపోయింది. అతడక్కడ ప్రశాంతంగా కూర్చుని ఎదురుగా ఉన్న వీణాతంత్రులపై వేళ్ళు నడిపిస్తూ శ్రుతులు సరిచేసుకొంటున్నాడు. సాయంకాల సంధ్యారాగం అతని అంగుళులతో పాటూ వీణాతంత్రులపై నృత్యం చేస్తున్నది. ఆమె మెల్లిగా అతని కెదురుగా కూర్చున్నది. ఒక నిమిషం వరకు అతడామెరాక గమనించనే లేదు. తరవాత ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తూ—

"ఇంతలోనే పునర్దర్శనం లభిస్తుందని అనుకోలేదు! ఏదో విశేషం ఉండాలి! ఏమిటి కథ!" అన్నాడు.

ఆమె అతని మాటల కెంతో [illegible] "అవును! మీ [illegible] కొంచెం [illegible] కోరిక వచ్చింది!" అన్నది.

"[illegible]" అని [illegible]

"అవును! మీ మాట సహాయం!"

అతడు ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడిచాడు.

"నామాట చెల్లిస్తానని ముందుగా మాట ఇస్తే చెబుతాను!"

అని వకుళమాలిక ఒక చిరునవ్వు నవ్వింది. జయాపీడుని కామె లోలోపలి అభిప్రాయమేమో బోధపడలేదు:

"నీవు ఆజ్ఞాపించడము, నేను తిరస్కరించడమూనా? ఎంత మాట!"

ఈ మాటతో వకుళమాలిక వల్లమాలిన సిగ్గుతో వంగిపోయింది:

"అయితే అడగనా?"

"ఎందు కంతటి సందేహం! అడిగో అడగకూడదా?"

"మరి మాట తిరిగిపోగూడదు!"

"ముమ్మాటికీ మాట తప్పను! సరేనా!"

వకుళమాలిక రెప్పవాల్చకుండా విస్ఫారిత నేత్రాలతో అతనికేసి చూసి, చిరునవ్వు నవ్వుతూ ఇలాగన్నది:

"మీరు కళ్యాణిని పట్టమహిషిగా అంగీకరించాలి! ఇదే నా కోరిక!"

"ఆ!" అని జయాపీడు డొక్కసారిగా స్తంభించిపోయాడు! ఆమె ఈవిధంగా కోరగలదని అతడు స్వప్నంలో కూడా భావించలేదు [illegible] కూడా [illegible]

ఆవిధంగా కోరడానికి కారణమేమో బోధపడలేదు. కొంత సేపటివరకు జయాపీడునికి నోట మాట రాలేదు. చిట్టచివరికి బొమముడి విరిచి—

"నీ విలాగ కోరడానికి కారణం?" అని ప్రశ్నించాడు.

"అది పిమ్మట మనవి చేసుకుంటాను కాని ముందు నా కోరిక మన్నించినట్టు వాగ్దానం చెయ్యాలి!"

"కారణ మేమో తెలిస్తేనే గాని ముందు వాగ్దానం చెయ్యలేను!"

"మొదట చేశారు గదా! అంతలోనే మరుపా?"

"మరిచిపోలేదు. కాని నేనన్న మాట చెల్లించదలుచుకోలేదు."

"ఇది మీకు ధర్మమేనా?"

"ధర్మమే అనిపించింది!"

అతడు అంతటి దృఢనిశ్చయంతో సమాధానం చెప్పడం ఆమె కెంతో ఆశ్చర్యమే కలిగించింది. అయితే ఆ దృఢనిశ్చయాని కామె లోలోపల ఎంతైనా సంతోషించింది. అయినా అది పైకి వెల్లడికానీయక నెమ్మదిగా ఇలా అన్నది.

"పోనీ నేను చెప్పే కారణాలు కొంచెం సావధానంగా చిత్తగించాలి!

"సరే కానీ! అలాగే!" అన్నాడు జయాపీడుడు.

వకుళమాలిక కొంచెం సందేహిస్తూ—

"నేను పణ్యస్త్రీని-" అన్నది.

"జయాపీడ చక్రవర్తి ఉవ్వెత్తుగా ఒక నవ్వునవ్వి—

"నిజమే! కాని నీవేమో పణ్యస్త్రీ ధోరణిలో ప్రసంగించడమే లేదు! కాని జయంతదేవులు కళ్యాణదేవి కేవలం గణిక అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు! ఏమి చిత్రం!" అన్నాడు. వకుళమాలిక ఈ మాటతో నిర్భ్రాంతిపోలేదు! ఒక్క చిరునవ్వునవ్వి ముక్కుమీద వేలుంచి—

"ఎంతమాట? ధర్మ సంరక్షకులని బిరుదు వహించినవారికి ఇలాగనడం ఏమి భావ్యంగా లేదు! మా ఇంటి కొందన్న కులవృత్తిని బట్టి నేను కేవలం గణిక నేగదా!"

అని తలవంచుకొన్నది.

జయాపీడ చక్రవర్తి ఏమీ చలించలేదు:


"అవును! నావు తెలియక పోలేదు! అయితే?"

"పట్టమహిషీపదవికి తగను!"

"ఆ అర్హతానర్హతలు నిర్ణయించ వలసినదానవు నీవు కావు!" అన్నాడు జయాపీడుడు ముక్తసరిగా.

అయినా వకుళమాలిక తనపట్టు వదలలేదు:

"అదీగాక మీ పట్టుదలలతో కాశ్మీర గౌడరాజ్యాల మధ్య యుద్ధంకూడా వచ్చేట్టుంది! నా జన్మదేశానికి చిచ్చుపెట్టానన్న ఈ అపవాదం నాకేల?"




బుద్ధ జయంతికి వేసే ప్రత్యేక తపాలా బిళ్లలకోసం స్వీకరించిన మరొక చిత్రం - శ్రీ సి. ఆర్. ప్రకాశి (ఢిల్లీ) రచించినది. ఈ చిత్రానికి "వన్నెలలో బోధి వృక్షం" అనేది మకుటం.

దీనితో జయాపీడు డొక్క నిమిషం ఊరుకుని గంభీరంగా ఇల్లాగన్నాడు:

"నీకోరికకు హేతువేమో నా కిప్పుడు ఆమూలాగ్రంగా తెలిసిపోయిందిలే! చాంద్రవర్ధన మహామాత్యులే నీచేత ఈ మాట లనిపిస్తున్నారు! సందేహమేమీ లేదు! ఏది ఏమైనా సరే! ఇక నీవే నా పట్టపురాణివి!"

జయాపీడు డీవిధంగా ఒక్క క్షణంలో జరిగినదంతా ఊహించి వేసినందు కామె లోలోపల చాలా ఆశ్చర్యపడింది. అయినా ఏమీ చలించకుండా ఒక్క చిరునవ్వునవ్వి నెమ్మదిగా ఇలాగన్నది.

"మీ ప్రాభవాధికారాలతో బెదిరించి వివాహ మాడడానికి నేనేమి కల్యాణదేవిని గాను! ఇంతవరకు నేను సర్వస్వతంత్రురాలనే! ఇకముందు అంతే! నా సమ్మతి లేనిదే నన్నెలా పట్టపురాణిని చేస్తారో నేను చూస్తానుగా!"

అని ఆమె బింకంగా మూతి బిగించింది.

ఈ సమాధానంతో జయాపీడునికి నోటమాట పెగలలేదు! ఆమె ఈ విధంగా తనపై అధికారం చెలాయించ గలదనికూడా అత డనుకోలేదు. అందుచేత బాగా తగ్గిపోయి సానునయంగా ఇలాగన్నాడు:

"సరే! గాని వకుళా! ఎందుకు నీ కింత పట్టుదల! నీచేత నేనేమి చేదుమింగించడం లేదుగదా!"

ఆ మాటపై వకుళమాలిక ఒక్క చిరునవ్వు నవ్వింది:

"నిజమే! మీ ఔదార్యం ఎంతటి అగాధమైనదో తెలియనంతటి మూర్ఖురాలను కాను! కాని చిన్నప్పటినుంచీ నాకు భోగభాగ్యాలకేమీ కొదవలేదు!

(55-వ పేజీ చూడండి)

# ★ దేవదాసి ★

(9- వ పేజీ తరువాయి)

ఎందరెందరో కులీనులు నాపాదాక్రాంతు లైనారు. అయితే నా జీవితం ఇంతవరకు కొంచమైనా అనురాగజ్యోతి లేక కేవలం అంధకార బంధురమైపోయింది! మీ దర్శనంతో నాలో ఆ వెలుగు మెరిసింది! నా కదే చాలు! మీ జీవితాన చేరి దారికి వచ్చేదు వట్టి గుణకరాళ్ల కోసం లేనిపోని ఈ అవ సాదులన్నీ నాకేల! ఈ యుద్ధప్రకటనని కంతటికీ నేనే కారణమని అబాలగోపాలము అన్నెందు కాడిపోను కోనాలి! నేని భోగభాగ్యాలతోను, సుఖ గౌరవాలతోను ఈ దేవదాసీవృత్తితో సుఖానుభవించిపోయాను. మీ పాదదాసిగా నాకింత ఆశ్రయమిస్తే చాలు! నాకదే మహాభాగ్యము! నామాట మన్నించండి!" అని ఆమె గద్గద స్వరంతో ఇక మాట్లాడలేకపోయింది. ఇక అతనేమన దానికి పోలుపోక ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు.

ఆమె అతని ముఖచ్ఛవి గమనించి ఎంతో సంతోషంతో లేచి నిలబడింది.

అతడామె వైపు చూస్తూ మళ్ళీ నిట్టూర్చి "ఏమైతేనేమి! చివరికి నీవే జయించావులే! నీ ఇష్టప్రకారమే కానీ!" అన్నాడు.

వెంటనే ఆమె ద్వారం దాకా నడిచి పోయి ఎంతో ఆప్యాయంగా జయసేనుని వైపు చూసి—

"అయ్యయ్యో! ఈ క్షణంతో మీ ప్రతిజ్ఞ నెరవేరిపోయింది.!" అన్నది.

"ఏది ఇంతవరకు అది నెరవేరలేదు గదా!"

"కళ్యాణిని వివాహమైపోగానే ఇక క్రమక్రమంగా గౌడరాజ్యానికి ఉత్తరాధికారులు మీరేగదా!"

"అవును. నీవన్నది చాలావరకు యథార్థమే! అయితే నీ కోరికవల్లనే గౌడరాజ్యం నాకు స్వగతమైనది.! అందువల్ల గౌడ రాజ్యం జయించినది నీవేకాని నేను కాదమ్మా!"

"కాని మున్ముందుగా నన్ను జయించిన వారు మీరే! అందువల్ల మీరాడిన చిట్ట చివరికి మీ ప్రతిజ్ఞే నెరవేరింది!"

అన్నది నవ్వుతూ. జయసేను డామె వాగ్ధాటిలో అంతరార్థం గ్రహించుకొని తటాలున లేచి ద్వారందగ్గరకు వెళ్ళి ఆమెను కౌగలించుకున్నాడు. ఆమె కొంతసేపు అతనివద్దు తప్పించుకోబోయినట్లు నటించింది. తరవాత "అదిగో కమల! ఎందుకో ఈవైపు వస్తున్నది.!" అని అవైపు చూపించింది. విజయశర్మ అక్కడ ఉన్నాడు! అక్క డ కమల కనిపించలేదు! [illegible]

"అదిగో అక్కా! ... [illegible]" అని చెప్పి అతని పరధ్యానం అవగా చూసుకొని తటా లున అతని కౌగిలి విడిపించుకొని తొందర తొందరగా లోపలికి వెళ్ళిపోయింది.

తరవాత జయసేన చక్రవర్తి కళ్యాణి దేవిని పట్టమహిషిగా అంగీకరించిన వార్త అంచెలమీద మహోత్సాహానికి, జయంత సేనునికి చేరిపోయింది. మరునాడు సంధి ప్రకారం జయసేనుని సైన్యాలు పాండ్ర వర్ధన నగరంలో ప్రవేశించాయి. అటు పిమ్మట అచిరకాలంలోనే కళ్యాణిదేవి జయసేనుల వివాహం కూడా జరిగిపోయింది. వివాహానంతరం కాశ్మీరపట్టమహిషి కళ్యాణి దేవి దాసదాసీ పరివారంతో భర్త్రగృహానికి తరలిపోయింది. వెంటవెంటనే నవరత్నమాలిక కూడా తన పరివారాలతో కాశ్మీరదేశా నికి వెళ్ళిపోయింది.

ఇక కమలకూడా ఆమెతో కలిసి వెళ్ళి పోయిందని వేరే ప్రత్యేకంగా వ్రాయ నక్కరలేదుగదా! —సమాప్తం. ★

## వైతరణిలో బంగారు ఇసుక

(10 వ పేజీ తరువాయి)

ఈ స్థలం ఆక్రమించుకు మునుపు కాని లేకుండా పనిచేస్తున్నారు వారు?" అని యిల్లా ఆ సమీపంలోని తెగలు అనుకో సాగారు.

వర్షప్రకారము కటుకోకటి కట్టి, వాళ్ళు ధర్మ దహనపరిచాల పోలీసులు పంచాయితీ చేసి, చలికి చచ్చిపోయినారని తీర్మానించి. తరువాత వాళ్ళ ఆ స్త్రీ ఎంత వెతికినా ఆ చిత్రరు, ఆ మందిగ, ఆ చేట తప్ప ఏమీ కనిపించలేదు, వాటినికూడా ఆ యిరువురి యొక్క దహనకార్యంలో ఆహుతి చేస్తూ పరి పూర్ణ భస్మం గావించారు.

ఇకగ్కన్నుంచి ప్రజానీకం ఆ అదిగో చెట్టు వడగొట్టి అదంతా సమస్థలం చేయ దానికి మొదలు పెట్టారు. క్రింద పడివున్న వాటి మధ్యలో త్రవ్విన తోట్ల త్రోసి చూదారు ఒకనాడు. దురిపారు ఒక్క కోటి పైనే ఎనో అయ్యా అంతలో తోచి. ఆ త్రవ్వులలోనుండి అరా అరా మంచు తెరా నుండి విరజారి వర్షిస్తుంది, మెరుస్తూ ఇక ఇసుక రేణువు, రెండోది యిసుక రేణువే! మూడోది యిసుక రేణువే! మెరుపు గీటు గీసి పరీక్షిస్తే అవన్నీ బంగారు యిసుక రేణు వులు. ఆ బంగారు యిసుక రేణువు తెల్ల వచ్చాయి. ఆ శూలకరిలా? ఆ కొత్తగా చాలిన చిలకలా? ఆ చనిపోయిన వాళ్ళ కృప? ఇది తేని ప్రశ్నగా మిగిలిపోయింది.

గృహస్థు:— ఇదిగో ఈ గుడ్డ చూడు, ఎలా పాడు చేశావో?

చాకలి:— దీని కేమండీ నిక్షేపంలాంటి దోవతి. పాడుచేశానంటారేమిటి?

గృహస్థు:— దారుణం! ఇది మొన్న నేను కొనుక్కున్న పంచె!

వాళ్ళు ... చిలకలను మళ్ళీ దాకా చెట్టును ఆశ్రయించి చూదారుకాని, మర్నాడు చిలకలు రాల్చిన ఆ పూలును ఆ ప్రజ్ఞ లేకపోయింది. నిన్నటి చిలకలు మరి రావని ఒక నిర్ధారణకు వస్తూ ఆ అదిగో చెట్టు అదిగో చెట్టు అంతా కూలేలా గొడ్డళ్ళ కొట్టారు కూలీలు! గభీమని చెట్టు కూలింది.

కాని వెలుతురుకు బదులు చీకటికమ్మింది, కొండొత్తు. ఆ చీకటిగుండా ఆకాశంకేసి చూస్తే అది అంతా కొంతసేపు అతి నల్లగా కనుపట్టి రెండు తెల్లనిగీతలమధ్య మళ్లీ నల్లని ప్రవాహంలో కనిపించింది, నల్లని తాచులా మెలికలు తిరిగి నడుస్తూ. పోల్కంటే కాచులాగుంది కాని దాని కడుపులో మొసళ్ళు, తేళ్ళు, తిమింగిలాలు ఇంకా ఎన్నో క్రూరతరమైన అగాధసరీ


## కలవరపడు స్త్రీలకు!



"కుమారి" (మాత్రలు) మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతలనువదలం

వెల (పౌడర్) రు. 3/-
(స్పెషల్) 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజి ప్యాకింగ్ ప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.
స్టాకిస్టు: Indo Medical supplies
No. 3, Paulappan st, Seven wells Madras - 1.

## అధైర్య పడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX— ADVICE పొందవచ్చును. మీకు ఉంటుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టరు రత్నంసన్స్,(Estd 1904)
మలక్ పేట బిల్డింగ్స్-హైదరాబాద్-2.
(ప్రక్క [illegible])